


అన్బురాజన్‌పై ఎస్సీ, ఎస్టీ కేసు

అనంతపురం క్రైం, ఆగస్టు 5: మునుపటి ఎస్పీ అన్బురాజన్, డీఎస్పీ ప్రసాద్ రెడ్డి, సీఐ శివరాముడుపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదైంది. వారు కులం పేరుతో దూషించారని సాకే రోజా అనే మహిళ ఎస్సీ, ఎస్టీ కోర్టును ఆశ్రయించారు. కోర్టు ఆదేశాల మేరకు టూటౌన్ పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. నగరానికి చెందిన న్యాయవాది శివప్రసాద్ తనపై హత్యాయత్నం చేశారని లత్తవరం గ్రామానికి చెందిన సాకే రోజా టూటౌన్‌లో ఫిర్యాదు చేశారు. సీఐ స్పందించలేదని డీఎస్పీకి, ఆయన పట్టించుకోలేదని ఎస్పీకి ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో వారు కులం పేరుతో దూషించారని ఆమె ఫిర్యాదులో పేర్కొన్నారు.

నిరీక్షణ



అప్పుల బాధతో 15 మంది రైతుల ఆత్మహత్య

ఎన్నికల కోడ్ కారణంగా ఆగిపోయిన నమోదు

పరిహారం కోసం బాధిత కుటుంబాల ఎదురుచూపు

అనంతపురం అర్బన్, ఆగస్టు 5: అప్పుల బాధతో ఆత్మహత్య చేసుకున్న రైతుల కుటుంబాలు ఆర్థిక సాయం కోసం ఎదురుచూస్తున్నాయి. కుటుంబాన్ని పోషించే పెద్ద దిక్కును పోగొట్టుకుని బాధిత కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ ఏడాది మార్చిలో సార్వత్రిక ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో రైతు బీమా పోర్టల్‌ను బంద్ చేశారు. ఎన్నికల ముగిసి కొత్త ప్రభుత్వం ఏర్పాటైనా పోర్టల్‌ను ఓపెన్ చేయలేదు. దీంతో ఆత్మహత్య చేసుకున్న రైతుల వివరాలను ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసేందుకు అవకాశం లేకుండాపోయింది. అలాగే తహసీల్దార్, ఆర్డీఓ, జిల్లా స్థాయి నుంచి రాష్ట్ర స్థాయికి ఆన్‌లైన్‌లో దరఖాస్తులను పంపలేకపోతున్నారు.

అప్‌లోడ్ చేయలేని దుస్థితి

2023 నవంబరు నుంచి ఇప్పటి దాకా జిల్లా వ్యాప్తంగా 15 మంది రైతులు అప్పులబాధతో ఆత్మహత్య చేసుకున్నారు. కోడ్‌కు ముందు అధికారులు ఎన్నికల హడావుడిగా ఉండటంతో ఆత్మహత్య చేసుకున్న రైతుల వివరాలు పోర్టల్‌లో అప్‌లోడ్ చేయలేదు. ఇప్పటి దాకా పోర్టల్ ఓపెన్ చేకపోవడంతో బాధిత కుటుంబాలు మండల స్థాయి అధికారులను పలు మార్లు కలిసినా ప్రయోజనం లేకపోయింది. ఎన్నికల సమయంలో వెళితే ఎన్నికల తర్వాత రావాలని చెప్పారని, ఇప్పుడేమో పోర్టల్ ఓపెన్ కాలేదని చెబుతున్నారని బాధితులు వాపోతున్నారు.

15 మంది ఆత్మహత్య

జిల్లా వ్యాప్తంగా అప్పుల బాధతో ఆత్మహత్య చేసుకున్న 15 బాధిత కుటుంబాలు ఆర్థిక సాయం కోసం ఎదురుచూస్తున్నాయి. గుత్తి మండలం ఊటకల్లుకు చెందిన రైతు బ్రహ్మచారి, కణేకల్లు మండలం గనిగెరకు చెందిన నాగరాజు, వజ్రకరూరు మండలం కొనకొండ్లకు చెందిన పరమేశ్‌కుమార్, అనంతపురం రూరల్ మండలం కందుకూరుకు చెందిన రైతులు పోలేరయ్య, కొడిమి ఓబులేసు, బుక్కరాయసముద్రం మండలం నీలారెడ్డిపల్లికి చెందిన భాస్కర్, దయ్యాల కుంటపల్లికు చెందిన వెంకటరాముడు, కూడేరు మండలం కడదరకుంటకు చెందిన సంగప్ప, పుట్లూరు మండలం పులిప్రొద్దుటూరుకు చెందిన గోపాల్‌రెడ్డి, పుట్లూరుకు చెందిన రాజశేఖర్‌రెడ్డి, గార్లదిన్నె మండలం మర్తాడుకు చెందిన మల్లికార్జున, గుత్తి మండలం శ్రీపురానికి చెందిన రామాంజినేయులు, బసనేపల్లికి చెందిన రంగ, శింగనమల మండలం ఉలికంటిపల్లికి చెందిన బాలకృష్ణ , నార్పలకు చెందిన శ్రీధర్‌లు అప్పుల బాధతో ఆత్మహత్య చేసుకున్నారు.

ఫైల్స్ పంపితేనే..

ఆత్మహత్య చేసుకున్న రైతుల వివరాలను జిల్లా వ్యవసాయ అధికారి కార్యాలయానికి పంపాల్సి ఉంది. కొన్ని మండలాల్లోని రెవెన్యూ అధికారులు పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. బాధిత రైతు కుటుంబ సభ్యులు తహసీల్దార్ కార్యాలయం వద్దకు డాక్యుమెంట్లను సమర్పించేందుకు వెళ్లినా సరైన సమాధానం చెప్పడం లేదు. కొన్ని మండలాల్లో తహసీల్దార్ కార్యాలయాల నుంచి మాన్యువల్‌గా ఆర్డీఓ కార్యాలయాలకు డాక్యుమెంట్లు పంపినట్లు తెలిసింది. కొన్ని మండలాలవారు కనీసం ఆ పని కూడా చేయలేదని సమాచారం. ఆత్మహత్య చేసుకున్న రైతు కుటుంబాలకు ప్రభుత్వం రూ.7 లక్షల సాయం అందిస్తుంది. జిల్లా అధికారుల నుంచి రాష్ట్రస్థాయి అధికారుల వద్దకు ఫైల్స్ చేరిన రెండు మాసాల్లో నామినీ ఖాతాకు రూ.7 లక్షలు జమ అవుతుంది.

సాయం అందలేదు..



అప్పుల బాధతో మా నాన్న భాస్కర్ పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నారు. ఎన్నికల సమయం కావడంతో అప్పట్లో అధికారులు మళ్లీ కలవాలని చెప్పారు. ఎన్నికల తర్వాత అన్ని రకాల పత్రాలను తహసీల్దార్ కార్యాలయంలో ఇచ్చాను. వ్యవసాయ శాఖ అధికారులు రాసుకుని వెళ్లారు. ఇప్పటి దాకా ఆర్థిక సాయం అందలేదు. డ్రైవర్‌గా పనిచేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నా. మాకు త్వరగా ఆర్థిక సాయం అందించాలి.

- మురళీమోహన్, నీలారెడ్డిపల్లి, బుక్కరాయసముద్రం మండలం

ప్రభుత్వం ఆదుకోవాలి..



నా భర్త బాలకృష్ణ అప్పుల బాధతో ఆత్మహత్య చేసుకున్నారు. నాకు కొడుకు, కూతరు ఉన్నారు. మా అత్త, మామతో కలిసి ఉంటున్నాం. పొలం పనులకు వెళ్లి బతుకుతున్నాం. మాకు రెండెకరాల పొలం ఉంది. మా పొలంతో పాటు మూడెకరాల కౌలుకు తీసుకొని నా భర్త వేరుశనగ, ఇతర రకాల పంటలు సాగు చేసేవాడు. పంటలు దిగుబడిరాక పోవడం, రోగాల బారిన పడి గొర్రెలు చనిపోవడంతో నష్టపోయాం. అప్పుల బాధతో ఆత్మహత్య చేసుకున్నాడు. ఎలా బతకాలో అర్థం కావడం లేదు. ప్రభుత్వం ఆదుకోవాలి.

- భాగ్యలక్ష్మి, ఉలికంటిపల్లి, శింగనమల

గడ్డి ఉత్పత్తికి.. గడ్డుకాలం





రెడ్డిపల్లి క్షేత్రానికి నిధుల కొరత

వర్షాభావంతో ఎండిపోయిన బోర్లు

గతంలో రైతులకు ఉచితంగా విత్తు, మొక్క

బుక్కరాయసముద్రం, ఆగస్టు 5: జిల్లాలో పశుగ్రాస సమస్యను నివారించడానికి ఏర్పాటు చేసిన గడ్డి విత్తన ఉత్పత్తి క్షేత్రానికి నిధుల కొరత తీవ్రంగా ఉంది. పశువులకు మేత ఉత్పత్తి చేయడానికి బుక్క రాయసముద్రం మండలంలోని రెడ్డిపల్లి గ్రామం వద్ద 1976లో పశు గ్రాస విత్తన ఉత్పత్తి క్షేత్రాన్ని ఏర్పాటు చేశారు. ఇందుకోసం 130 ఎక రాల ప్రభుత్వ భూమిని కేటాయించారు. నిర్వహణ కోసం ఒక ఏడీ స్థాయి పశువైద్యాధికారిని, కొంత మంది సిబ్బందిని ఏర్పాటు చేశారు. పశుగ్రాస క్షేత్రంలో ఉత్పత్తి చేసిన విత్తనాలు, గడ్డి విత్తన ముక్కలకు బాగా డిమాండ్ ఉన్నా.. ప్రస్తుతం పశుగ్రాస విత్తనాల పంపిణీ లక్ష్యాన్ని చేరుకోలేకపోతున్నారు. పశుగ్రాస క్షేత్రంలో బోరు బావులు అడుగంటిపోవడమే దీనికి ప్రధాన కారణం. ప్రస్తుతం 130 ఎకరాలలో కేవలం 20 ఎకరాలలోనే పశుగ్రాస పంటలు సాగుచేస్తున్నారు. దాదాపు 60 ఎకరాలలో వర్షాధారం కింద జొన్న గడ్డి వేస్తున్నారు.

నిధుల కొరత

పశుగ్రాస ఉత్పత్తి క్షేత్రాన్ని నిధుల సమస్య వెంటాడుతోంది. గతంలో కేంద్రం నుంచి గోచార్ నిధుల కింద రూ.15 లక్షల నుంచి రూ.20 లక్షల వరకు మంజూరయ్యేవి. ప్రస్తుతం నిధులు రాకపోవడంతో ఏడీ స్థాయి అధికారే బయట నుంచి నిధులు తెచ్చి సాగు చేయాల్సి వస్తోంది. రెండు మూడు బోర్లలో మాత్రమే నీరు వస్తుండడంతో గడ్డిలో మేలు జాతి రకాలు సాగు చేయలేని పరిస్థితి ఏర్పడింది.

గతంలో ఉచితం

గతంలో ఈ క్షేత్రంలో రైతులకు పశుగ్రాస విత్తనాలు, గడ్డి ముక్కలు ఉచితంగా ఇచ్చే వారు. 2010 వరకు సన్నకారు రైతులకు ఇక్కడ పండించిన గడ్డి విత్తనాలు, గడ్డి విత్తన ముక్కలను అందజేశారు. ప్రస్తుతం ఒక గడ్డివిత్తన మొక్కను 60 పైసల వంతున విక్రయిస్తు న్నారు. గడ్డి విత్తనాలను మాత్రం రకాన్ని బట్టి రైతులకు 40-60 శాతం సబ్సిడీపై ఇస్తున్నారు.

అందుబాటులో మేలైన రకాలు

రెడ్డిపల్లి క్షేత్రం ప్రస్తుతం సూపర్ నేపియర్, రెడ్ నేపియర్, హిరా మణి, కో ఎఫ్33, హెడ్జ్ లూసర్న్ తదితర రకాలు అందుబా టులో ఉన్నాయి. తక్కువ విస్తీర్ణంలో సాగు చేయడంతో విత్తనాన్ని కొంత మంది రైతులకే సరఫరా చేయగలు గుతున్నారు. ఈ ఏడాది కేవలం 273 మంది రైతులకు విత్తనాలను అందజేశారు. జిల్లాలో వర్షాభావ పరిస్థి తుల నేప థ్యంలో పశుగ్రాసం కొరత తీవ్రంగా ఉంది. ప్రభుత్వం వ్యవసాయ బోర్లు వేయించి, సకాలంలో నిధులు మంజూరు చేస్తే పశువులకు మేలైన గ్రాసం అందించే అవకాశం ఉంటుంది. ఇక్కడ ప్రతి నెల వ్యవ సాయ ఖర్చు రూ.లక్షకు పైగా వస్తుంది. అప్పు చేసి ఖర్చు పెడుతు న్నారు.

అవగాహన కల్పించాలి



రెడ్డిపల్లి పశుగ్రాస క్షేత్రంలో సాగు చేస్తున్న పశుగ్రాసాల రకాలపై రైతులకు అవగాహన సదస్సులు పెట్టాలి. గడ్డిలో వచ్చే నూతన రకాలు ఎలా సాగు చేయాలి? అవి పశువులకు ఎంత మేర ఉపయోగపడుతాయన్న వివరాలను క్షేత్ర స్థాయిలో రైతులకు తెలియజేయాలి.

-పెద్దన్న, రైతు

ఉత్పత్తి పెంచాలి..

రెడ్డిపల్లి వద్ద ఏర్పాటు చేసిన పశుగ్రాస విత్తన ఉత్పత్తి క్షేత్రానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిధులు మంజూరు చేయాలి. రైతులకు పశుగ్రాస విత్తనాలు పంపిణీ చేసేందుకు చర్యలు తీసుకోవాలి. ప్రస్తుతం జిల్లాలో వర్షాభావం కారణంగా గడ్డి సమస్య తీవ్రంగా ఉంది. ఇక్కడ గడ్డి ఉత్పత్తిని పెంచి రైతులకు అందించేలా చర్యలు తీసుకోవాలి.

-అవలికొండ సిద్ధయ్య, రైతు

నీటి సమస్య..

పశుగ్రాస విత్తన ఉత్పత్తి క్షేత్రంలో వ్యవసాయ బోర్లు అడగంటిపో యాయి. దీంతో తక్కువ విస్తీర్ణంలో సాగు చేయాల్సి వస్తోంది. కొత్తగా బోర్లు వేస్తే నూతన రకాలను ఉత్పత్తి చేసేందుకు కృషి చేస్తాం. వర్షా ధారం కింద 60 ఎకరాలలో జొన్న రకం వేస్తున్నాం. కేవలం రూ.61 వేలతో 80 ఎకరాలలో పంట సాగు చేయడం కష్టంగా ఉంది. గత ఏడాది గడ్డి విత్తనాలు, గడ్డివిత్తన ముక్కల ద్వారా వచ్చిన రూ.25 లక్షల ఆదాయాన్ని ప్రభుత్వానికి అందజేసాం.

- సుబ్రహ్మణ్యం, ఏడీ

ప్రతి ఇంటిపై త్రివర్ణ పతాకం రెపరెపలాడాలి

బీజేపీ జిల్లా అధ్యక్షుడు సందిరెడ్డి శ్రీనివాసులు



అనంతపురం సెంట్రల్, ఆగస్టు 5: స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలకు గుర్తుగా ప్రతి ఇంటిపై 15న త్రివర్ణ పతాకం రెపరెపలాడాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు సందిరెడ్డి శ్రీనివాసులు అన్నారు. బీజేవైఎం ఆధ్వర్యంలో ఆర్ అండ్ బీ అతిథి గృహంలో సోమవారం ఆయన విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రభుత్వ కారాలయాలు, విద్యాసంస్థల్లో మాత్రమే జాతీయ జెండాను ఎగరవేయడం ఆనవాయితిగా వస్తోందని అన్నారు. స్వాతంత్ర్య పోరాటం, బలిదానాల గురించి భావి తరాలకు తెలియాలంటే ప్రతి ఇంటిపైనా జాతీయ పతాకాన్ని ఎగరవేయాల్సిన అవసరం ఉందని అన్నారు. ఇందులో భాగంగా హర్‌ఘర్ తిరంగా కార్యక్రమాన్ని నిర్వహించేందుకు జోనల్, జిల్లా, మండల స్థాయిలో కమిటీలను ఏర్పాటు చేశామని తెలిపారు. ఈ నెల 11 నుంచి 14 వరకు యువమోర్చా తిరంగా యాత్రను నిర్వహిస్తుందని తెలిపారు. జాతీయ నాయకుల విగ్రహాలను శుభ్రపరచి నివాళులు అర్పిస్తారని తెలిపారు. మౌనయాత్ర నిర్వహిస్తామని, విశిష్ట వ్యక్తులు, విద్యార్థులతో హాల్ మీటింగ్‌ను ఏర్పాటు చేస్తామని అన్నారు. రాయలసీమ జోనల్ ఇన్‌చార్జి కాపు రామచంద్రారెడ్డి ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షిస్తారని తెలిపారు. ప్రధాని నరేంద్రమోదీ సూచనమేరకు జాతీయ భావంతో స్వాతంత్ర్య దినోత్సవాన్ని జరుపుకోవాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో యువ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి అశోక్‌రెడ్డి, బీజేపీ అసెంబ్లీ నియోజకవర్గ కన్వీనర్ గొంది అశోక్‌కుమార్, నాయకులు ఈశ్వర్, ఇలియాజ్, రింజిత్, రవికుమార్, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

అమరావతిలో సమీక్ష

అనంతపురం టౌన్, ఆగస్టు 5: ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అమరావతి లోని సచివాలయంలో సోమవారం నిర్వహించిన సమీక్షకు జిల్లా నుంచి కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్, ఎస్పీ మురళీకృష్ణ హాజరయ్యారు. కార్యక్రమంలో సీఎం, ఇతర మంత్రులు, సీఎస్, ఆయాశాఖల కమిషనర్లు వివిధ అంశాలపై సమీక్షించారు. అభివృద్ధి ప్రణాళికలు వివరించి దిశానిర్దేశం చేశారు. కలెక్టర్లతో సమీక్ష మంగళవారం కూడా కొనసాగుతుందని అధికారులు తెలిపారు. రెండో రోజు కలెక్టర్, ఎస్పీ ద్వారా జిల్లా సమస్యలు, ప్రగతి నివేదికల అభిప్రాయాలను సీఎం, సీఎస్, మంత్రులు తీసుకుంటారని అధికార వర్గాలు తెలిపాయి.



సమీక్షలో పాల్గొన్న కలెక్టర్, ఎస్పీ

ఫిర్యాదుల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి

- డీఆర్‌ఓ రామకృష్ణారెడ్డి

అనంతపురం టౌన్, ఆగస్టు 5: ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదుల పరిష్కారం పట్ల ఆయాశాఖల అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలని డీఆర్‌ఓ రామకృష్ణారెడ్డి ఆదేశించారు. కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవన్‌లో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పీజీఆర్‌ఎస్) నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వందలాదిమంది బాధితులు తరలివచ్చి తమ సమస్యలపై వినతి పత్రాలు అందజేశారు. కలెక్టరు వినోద్‌కుమార్ అమరావతిలో జరిగే కలెక్టర్ల సమావేశానికి, జేసీ బదిలీపై వెళ్లడంతో పీజీఆర్‌ఎస్‌ను డీఆర్‌ఓ ఆధ్వర్యంలో నిర్వహించారు. డీఆర్‌డీఏ పీడీ ఓబుళమ్మ, జడ్పీ సీఈఓ ప్రభాకరరావు, ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వరరావు తదితరులు ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. మొత్తం 416 అర్జీలు వచ్చినట్లు డీఆర్‌ఓ తెలిపారు. అనంతరం ఆయన జిల్లా ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. అందుకే ప్రతి శాఖ ఉన్నతాధికారి ఫిర్యాదుల పరిష్కారం పట్ల ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. ఒకే సమస్యపై ఫిర్యాదులు పునరావృతం కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు.



ఫిర్యాదులు స్వీకరిస్తున్న డీఆర్‌ఓ రామకృష్ణారెడ్డి, ఇతర అధికారులు

అమావాస్య కాదు.. అయిష్టతే..!

- ఐదు నియోజకవర్గాల్లో సమస్య
- సోమవారం విధుల్లో చేరని తహసీల్దార్లు
- అనంత, శింగనమల, గుంతకల్లులో జాయిన్



అనంతపురం టౌన్, ఆగస్టు 5: తహసీల్దార్ల పోస్టింగ్‌పై అనుకున్నట్లుగానే జరుగుతోంది. చాలా మండలాలకు కేటాయించిన తహసీల్దార్ల పట్ల స్థానిక ప్రజాప్రతినిధులు విముఖత చూపుతున్నట్లు స్పష్టమౌతోంది. జిల్లాకు తిరిగొచ్చిన 40 మంది తహసీల్దార్లకు స్థానాలను కేటాయిస్తూ.. శుక్రవారం అర్ధరాత్రి కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. కలెక్టరేట్‌కు ఆరుగురిని, అనంతపురం, గుంతకల్లు ఆర్డీఓ కార్యాలయాలకు ఒక్కొక్కరిని నియమించారు. అనంత అర్బన్, రూరల్ సహా అన్ని మండలాలకు మిగిలిన 32 మందిని కేటాయించారు. వీరిలో పామిడి తహసీల్దారు శ్రీధర మూర్తి మాత్రమే శనివారం విధుల్లో చేరారు. ఆశాఢం, ఆదివారం అమావాస్య కావడంతో చాలామంది సోమవారం విధుల్లో చేరుతారని భావించారు. కానీ, అసలు విషయం అది కాదని, స్థానికంగా విముఖత వ్యక్తమౌతోందని ప్రచారం జరిగింది. దీనిపై ఆంధ్రజ్యోతిలో ఆదివారం ప్రచురితమైన కథనం నిజమైంది. చాలా మండలాల్లో తహసీల్దారు సోమవారం కూడా విధుల్లో చేరలేదు. అనంతపురం అర్బన్, శింగనమల, గుంతకల్లు నియోజకవర్గాలలో మాత్రమే సోమవారం అందరూ జాయిన్ అయ్యారు.

ఇక్కడే పితలాటకం..?

రాయదుర్గం నియోజకవర్గంలోని గుమ్మఘట్ట, కళ్యాణదుర్గం నియోజకవర్గంలోని కళ్యాణదుర్గం, కుందుర్పి, కంబదూరు, ఉరవకొండ నియోజకవర్గంలోని కూడేరు, బెళుగుప్ప, రాప్తాడు నియోజకవర్గంలోని అనంతపురం రూరల్, తాడిపత్రి నియోజకవర్గంలోని తాడిపత్రి, పెద్దవడుగూరు, యాడికి తహసీల్దార్లు విధుల్లో చేరలేదు. కలెక్టరేట్‌కు ఆరుగురిని కేటాయించగా ఐదుగురు జాయిన్ అయ్యారు. రియాజుద్దీన్ కలెక్టరేట్‌లో చేరేందుకు ఇష్టపడటం లేదని సమాచారం. కలెక్టరేట్ ఏఓగా మారుతి బాధ్యతలు తీసుకున్నారు. గుంతకల్లు ఆర్డీఓ కార్యాలయానికి నియమించిన ఓ తహసీల్దారు విధుల్లో చేరేందుకు ఇష్టపడటం లేదని తెలిసింది. ఆమె తాడిపత్రి నియోజకవర్గంలోని ఓ మండలానికి వెళ్లాలని ప్రయత్నిస్తున్నారని తెలిసింది. కూడేరు, బెళుగుప్ప, అనంతపురం రూరల్, తాడిపత్రి, పెద్దవడుగూరు, యాడికి, గుమ్మఘట్ట స్థానాలపై ఎక్కువగా చర్చ జరుగుతోంది.

కలెక్టరు వచ్చిన తర్వాతనే..

ముఖ్యమంత్రి సమీక్ష నేపథ్యంలో కలెక్టరు డాక్టర్ వినోద్ కుమార్ అమరావతికి వెళ్లారు. ఆయన బుధవారం జిల్లాకు తిరిగొచ్చే అవకాశాలు ఉన్నాయి. కళ్యాణదుర్గం తహసీల్దారు ఆర్డీఓను కలిసి వచ్చారని, ఆయన ఎల్లుండి జాయిన్ అవుతారని అంటున్నారు. మరో ఇద్దరు కూడా ఈ మాటే అన్నట్లు తెలిసింది. కలెక్టర్ వచ్చేలోగా ఎంతమంది విధుల్లో చేరుతారో, ఎన్ని పెండింగ్ పడతాయో స్పష్టత వస్తుంది. విధుల్లో చేరనివారి గురించి కలెక్టర్ నిర్ణయం తీసుకుంటారని, వారికి రీ పోస్టింగ్ ఇస్తారని అంటున్నారు. మార్పులు చేర్పులు ఉంటాయా..? లేక అందరూ విధుల్లో చేరుతారా అన్న ఉత్కంఠ నెలకొంది.

ఖాళీ హాస్టళ్లు

అడ్మిషన్లు పట్టని బీసీ హాస్టళ్ల వార్డెన్లు

ప్రభుత్వ బడులు తెరిచి రెండు నెలలు

అటువైపు కన్నెత్తి చూడని సంక్షేమ అధికారులు

అనంతపురం ప్రెస్‌క్లబ్, ఆగస్టు 5: ప్రభుత్వ సంక్షేమ హాస్టళ్లలో సీట్లు భర్తీ కావడం లేదు. విద్యార్థులను చేర్పించేందుకు కొందరు వార్డెన్లు, అధికారులు చొరవ చూపడం లేదు. బీసీ సంక్షేమశాఖ పరిధిలో జిల్లా వ్యాప్తంగా వెయ్యి సీట్లు ఖాళీగా ఉన్నాయి. ఈ ఏడాది జిల్లాలోని ప్రీమెట్రిక్ హాస్టళ్లకు 6,400 సీట్లు కేటాయిస్తే.. అందులో ఇప్పటి వరకూ 5,464 మంది విద్యార్థులకు ప్రవేశం కల్పించారు. దాదాపు 936 సీట్లు ఇంకా ఖాళీగా ఉన్నాయి. పాఠశాలలు ప్రారంభమై రెండు నెలలు కావస్తున్నా వసతిగృహాల్లో సీట్లు భర్తీ కాకపోవడంపై సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి.

డివిజన్ల వారీగా ఖాళీలు...

- అనంతపురం డివిజన్ పరిధిలోకి అనంతపురం నగరంతో పాటు శింగనమల నియోజకవర్గం శింగనమల, నార్పల, బుక్కరాయసముద్రం మండలాలు, ఉరవకొండ, రాప్తాడు మండలాలు వస్తాయి. ఈ డివిజన్‌లో దాదాపు 14 ప్రీమెట్రిక్ వసతిగృహాలున్నాయి. వీటికి ఈ ఏడాది 2,430 సీట్లను కేటాయించారు. ఇందులో ఇప్పటి వరకూ 1981 మంది విద్యార్థులకు ప్రవేశం కల్పించగా... ఇంకా 449 సీట్లు ఖాళీలున్నాయి. ఇక్కడ కొన్ని హాస్టళ్లల్లో 50 సీట్లకుపైగా ఖాళీలు ఉన్నాయి.
- తాడిపత్రి డివిజన్ పరిధిలో తాడిపత్రి, గుంతకల్లు నియోజకవర్గాలు, శింగనమల నియోజకవర్గంలోని నార్పల మండలంలోని కొన్ని ప్రాంతాలు ఉన్నాయి. ఇక్కడ 11 ప్రీమెట్రిక్ హాస్టల్స్ ఉండగా... అన్నింటికీ కలిపి 1760 సీట్లు కేటాయించారు. ఇప్పటి వరకూ 1604 మంది విద్యార్థులకు ప్రవేశం కల్పించారు. 156 సీట్లు ఖాళీలున్నాయి. ఈ డివిజన్‌లోనూ 30 నుంచి 50 సీట్లలోపు ఖాళీలున్నట్లు తెలుస్తోంది.
- కళ్యాణదుర్గం డివిజన్ పరిధిలో కళ్యాణదుర్గం నియోజకవర్గంతో పాటు రాయదుర్గం నియోజకవర్గాల్లో హాస్టళ్లు ఉన్నాయి. ఈ డివిజన్ పరిధిలో 13 ప్రీమెట్రిక్ హాస్టళ్లు ఉన్నాయి. వీటికి 2,210 సీట్లను కేటాయించగా... ఇప్పటి వరకూ 1879 అడ్మిషన్లు కల్పించారు. ఇంకా 331 సీట్లు ఖాళీలున్నాయి.





అనంతపురం: బీసీ సంక్షేమ వసతిగృహంలో స్టడీ అవర్

వార్డెన్ల వైఫల్యం

ప్రభుత్వ నిబంధనల మేరకు పాఠశాలలు పునఃప్రారంభమైన వెంటనే వసతిగృహాల్లో అడ్మిషన్లు చేపట్టాలి. తమ హాస్టల్ పరిధిలో ఉన్న ప్రభుత్వ పాఠశాలలకు సంబంధిత వార్డెన్లు వెళ్లాల్సి ఉంటుంది. అక్కడ 3 నుంచి 10వ తరగతి వరకు గల విద్యార్థులకు వసతి, మెనూ తదితర అంశాలను వివరించి హాస్టల్లో చేర్పించే బాధ్యతను తీసుకోవాలి. కానీ కొందరు వార్డెన్లు పట్టించుకోవడం లేదు. పాఠశాలలకు వెళ్లిన దాఖలాలు లేవు. గత ఏడాది విద్యార్థుల రెన్యువల్స్, ఎవరైనా హాస్టల్ వెతుక్కుంటూ వస్తే ఇచ్చిన అడ్మిషన్లు తప్ప.. వారే స్వయంగా వెళ్లిన సందర్భాలు లేవు. ఆ శాఖ అధికారులు సైతం అడ్మిషన్ల విషయంలో చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు.

భర్తీ చేస్తాం..

జిల్లా వ్యాప్తంగా ప్రీమెట్రిక్ హాస్టళ్లల్లో సీట్లు ఖాళీగా ఉన్న మాట వాస్తవమే. వార్డెన్లు పాఠశాలలకు వెళ్లి అడ్మిషన్లు తీసుకురావాలి. ఆ మేరకు ఏబీసీడబ్ల్యూఓలకు ఆదేశాలు జారీ చేశాం. ఈ నెల 15లోగా జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్ని ప్రీమెట్రిక్ హాస్టళ్లల్లో అడ్మిషన్లను పూర్తి చేస్తాం.

-కుష్బూకొఠారీ, డీడీ, బీసీ సంక్షేమశాఖ





ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సోమవారం అమరావతిలో నిర్వహించిన కలెక్టర్ల సమావేశంలో పాల్గొన్న ఉమ్మడి జిల్లా మంత్రులు సత్యకుమార్ యాదవ్, పయ్యావుల కేశవ్, సవిత

ఆయకట్టుకు పూర్తిస్థాయిలో నీరిస్తాం: కాలవ



కణేకల్లు చెరువులో గంగపూజ చేస్తున్న కాలవ శ్రీనివాసులు

కణేకల్లు, ఆగస్టు 5: హెచ్చెల్సీ ఆయకట్టు భూములకు ఈ ఏడాది పూర్తి స్థాయిలో నీటిని విడుదల చేసి రైతులకు ఇబ్బందిలేకుండా చూస్తామని ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు పేర్కొన్నారు. స్థానిక శ్రీచిక్కణ్ణేశ్వర వడియార్ చెరువులో సోమవారం గంగపూజ చేసిన ఆయన నూతనంగా నిర్మించిన కల్వర్టును కూడా ప్రారంభించి మాట్లాడారు. ఈ ఏడాది సమృద్ధిగా వర్షాలు కురవడంతో తుంగభద్ర డ్యాంలో కావాల్సినంత నీరు ఉందన్నారు. తద్వారా రైతులు పూర్తిస్థాయిలో పంటలు పండించుకునే వెసులుబాటు కలిగిందన్నారు. టీబీ డ్యాంలో 99 టీఎంసీల నీటి నిల్వ ఉండటంతో ఆంధ్ర సరిహద్దు హెచ్చెల్సీలో 1400 క్యూసెక్కుల నీరు ప్రవహిస్తోందని, దానిని 1600 క్యూసెక్కులకు పెంచనున్నట్లు ఆయన తెలిపారు. భవిష్యత్తులో వర్షాలు తగ్గుముఖం పడితే నీటి సరఫరా తగ్గిపోయే అవకాశం ఉన్నందున నీటి పొదుపును పాటించాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్చెల్సీ డీఈ మద్దిలేటి, టీడీపీ నాయకులు లాలెప్ప, ఆనంద్‌రాజ్, వేలూరు మరియప్ప, కోకుర్తి సుదర్శన్, బీటీ రమేష్, షేక్‌ముజ్జు, బాయినేని నవీన్, మాబుసాబ్, అనిల్ పాల్గొన్నారు.

సర్దుబాటుకు ముందే జీవో 117 రద్దు చేయాలి

అనంతపురం విద్య, ఆగస్టు 5: ఉపాధ్యాయుల సర్దుబాటుకు ముందే జీవో 117ను రద్దు చేయాలని ఆప్టా జిల్లా అధ్యక్షుడు గోపాల్‌రెడ్డి, జిల్లా ప్రధానకార్యదర్శి వెంకట రత్నం సోమవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. పాఠశాల విద్యాశాఖ ఫేషియల్ రికగ్నిషన్ యాప్‌లో టీచర్స్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్ (టిస్) సమాచారం సేకరిస్తోందన్నారు. ఇది టీచర్ల సర్దుబాటు కోసమే అంటూ ఉపాధ్యాయులు భావిస్తున్నారని, దీనిపై విద్యా శాఖ మంత్రి ఉపాధ్యాయ సంఘాలతో చర్చించాలన్నారు. పాదయాత్రలో విద్యాశాఖ మంత్రి లోకేశ్ జీవో 117 రద్దు చేస్తామని ఇచ్చిన హామీని నిలబెట్టుకుంటారని ఉపాధ్యాయులు భావిస్తున్నట్లు తెలిపారు. జీవో 117 వల్ల ప్రాథమిక పాఠశాలలు చాలా వరకూ మూతపడే పరిస్థితి ఉందని, ఇది కొనసాగితే దాని ప్రభావం ఉన్నత పాఠశాలలపై పడుతుందని హెచ్చరించారు. గత ప్రభుత్వం తీసుకొచ్చిన అసంబద్ధమైన జీవోను వెంటనే రద్దు చేయాలని కోరారు.

చీనీ టన్ను రూ.17వేలు



అనంతపురం రూరల్, ఆగస్టు 5: అనంతపురం వ్యవసాయ మార్కెట్‌లో సోమవారం చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ.17,150, కనిష్ఠంగా రూ.5వేలు, సరాసరి రూ.11,500తో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణి కార్యదర్శి జయలక్ష్మి తెలిపారు. మార్కెట్‌కు మొత్తంగా 710 టన్నుల చీనీకాయలు వచ్చాయన్నారు.

టమోటా కిలో రూ.23



అనంతపురం రూరల్, ఆగస్టు 5: కక్కలపల్లి మార్కెట్‌లో కిలో టమోటా గరిష్ఠంగా రూ.23తో అమ్ముడుపోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రాంప్రసాద్ తెలిపారు. మార్కెట్‌కు సోమవారం 2600టన్నుల టమోటా దిగుబడులు వచ్చాయన్నారు. కిలో సరాసరి ధర రూ.18, కనిష్ఠ ధర రూ.12 పలికినట్లు ఆయన తెలిపారు.

విజయ డెయిరీ ద్వారా రైతులను ఆదుకోవాలి

సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రాంభూపాల్

అనంతపురం కల్చరల్, ఆగస్టు 5: విజయ డైరీ ద్వారా పాడి రైతులను ఆదుకోవాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రాంభూపాల్ సోమవారం ఓ ప్రకటనలో రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రైతుల నుంచి పాల సేకరణకు గత ప్రభుత్వం అమూల్ కంపెనీతో చేసుకున్న ఒప్పందాన్ని తెలుగుదేశం కూటమి ప్రభుత్వం ఈనెల 10 నుంచి రద్దు చేయనుంది. దీంతో పాడి రైతులు దిక్కుతోచని స్థితిలో పడ్డారని తెలిపారు. ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయకుండా ఈరకమైన నిర్ణయం తీసుకోవడం సరికాదన్నారు. మన జిల్లాలో వందకు పైగా కేంద్రాల ద్వారా పాల సేకరణ చేయాలని అమూల్ కంపెనీ లక్ష్యంగా పెట్టుకుని ఏడు కేంద్రాల ద్వారా పాలు సేకరిస్తోందని, ఇలా సేకరించిన పాలల్లో ప్రతిరోజు దాదాపు 60వేల లీటర్లు రాయలసీమ జిల్లాల్లోని అంగన్వాడీ కేంద్రాలకు పంపుతున్నారన్నారు. అమూల్ కంపెనీతో ఒప్పందాన్ని రద్దు చేసుకోవడంతో అంగన్వాడీ కేంద్రాలకు కర్ణాటక నుంచి పాలను సరఫరా చేయాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు వార్తలొస్తున్నాయని, ఇది పాడిరైతులకు తీవ్ర నష్టాన్ని కలిగిస్తుందన్నారు. ఇప్పటికే పశువుల ధరలతోపాటు దానా, గడ్డి, పశువుల వైద్యం ఖర్చులు పెరిగి పాడిరైతులు నష్టాల్లో ఉన్నారన్నారనీ, కాబట్టి ప్రభుత్వం విజయ డెయిరీ ద్వారా రైతులకు గిట్టుబాటు ధర కల్పించి, పాలను సేకరించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

పోక్సో కేసులో ఐదేళ్ల జైలు శిక్ష

అనంతపురం క్రైం, ఆగస్టు 5: పోక్సో కేసులో నేరం రుజువు కావడంతో నిందితుడికి ఐదేళ్ల జైలు శిక్ష విధిస్తూ అనంతపురం పోక్సో కోర్టు న్యాయాధికారి రాజ్యలక్ష్మి సోమవారం తీర్పునిచ్చారు. పెద్దవడుగూరు మండలం గుత్తి అనంతపురం గ్రామానికి చెందిన తపిల రామాంజినేయులు 2020 మే 8న అదే మండలంలోని మరో గ్రామంలో నేరానికి పాల్పడ్డాడు. ఓ ఇంట్లో ఎవరూ లేని సమయంలో బాలికపై అత్యాచారానికి యత్నించాడు. బ్లేడు, కత్తిపీటతో ఆ బాలిక గొంతు కోశాడు. అప్పటి పెద్దవడుగూరు ఏఎస్ఐ నారాయణ నాయక్ కేసు నమోదు చేశారు. అప్పటి సీఐ రవిశంకర్‌రెడ్డి చార్జిషీట్ దాఖలు చేశారు. శిక్ష పడేలా చేసిన పోలీస్ సిబ్బందిని ఎస్పీ అభినందించారు.

తుంగభద్ర జలాశయానికి తగ్గిన ఇన్‌ఫ్లో



బొమ్మనహాళ్, ఆగస్టు 5: తుంగభద్ర జలాశయానికి సోమవారం ఇన్‌ఫ్లో తగ్గింది. సాయంత్రానికి 100.410 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్లు బోర్డు అధికారులు తెలిపారు. ఆదివారం 1,32,202 క్యూసెక్కులున్న ఇన్‌ఫ్లో సోమవారం సాయంత్రానికి 82,780 క్యూసెక్కులకు తగ్గింది. దీంతో 12 క్రస్టుగేట్లు రెండు అడుగులు ఎత్తి ఈపీజీ, కాలువలకు మొత్తంగా 50,156 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. హెచ్చెల్సీ ఆంధ్రా సరిహద్దులోని 105 కి.మీ. వద్ద 1360 క్యూసెక్కుల నీటి ప్రవాహం కొనసాగుతోంది. .

మామూళ్లమ్మ..!



మేడమ్‌కు ప్రతినెలా ముడుపులు వెళ్లాల్సిందే
ఇవ్వకపోతే తనిఖీలతో వేధింపులు
రిజిస్ట్రేషన్ల శాఖలో ఇష్టారాజ్యం
యథేచ్ఛగా వసూలు చేస్తున్న సబ్ రిజిస్ట్రార్లు

అనంతపురం క్రైం, ఆగస్టు 5: ప్రభుత్వ శాఖల్లో ఎక్కువగా అవినీతి జరిగే అవకాశమున్న శాఖల్లో స్టాంపులు, రిజిస్ట్రేషన్ శాఖ ఒకటి. ప్రతి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలోనూ ప్రతి రోజూ సాయంత్రం ఓ మేస్త్రీ కూలీలకు పంచినట్లు పైసలు పంపకాలు చేస్తారనే విమర్శలున్నాయి. ఈసీల దగ్గర నుంచి 08 భూముల వరకు అంతటా అవినీతే. సాధారణ రిజిస్ట్రేషన్‌కు సైతం డబ్బులు ఇవ్వాల్సిందే. డాక్యుమెంట్ రైటర్లు ఇందుకు పూర్తి స్థాయిలో సిద్ధంగా ఉంటారు. ప్రతి డాక్యుమెంట్‌కు రేటు కట్టి క్రయ, విక్రయదారులతో వసూలు చేస్తారు. సబ్‌రిజిస్ట్రార్లకు సైతం అందులోనే వాటా ఉంటుంది. ఇవన్నీ ఇలా జరిగిపోతుంటే.. ఉన్నతాధికారులకు సైతం ప్రతి నెలా చాలా పద్ధతిగా మామూళ్లు చేరిపోతుంటాయి. జిల్లా ఉన్నతాధికారిగా ఉన్న ఓ మేడమ్ ఈ విషయంలో చాలా స్ట్రిక్టుగా ఉంటారు. మేడమ్‌కు తప్పనిసరిగా ప్రతి నెలా మామూళ్ల వాటా వెళ్లాల్సిందే. మేడమ్ ఆగ్రహం వ్యక్తం చేశారా..? అంతే సంగతులు. శ్రీసత్యసాయి జిల్లా స్థాయి ఉన్నతాధికారిగా ఉన్న మరో మేడమ్ సైతం ఇదే స్థాయిలో వసూళ్లకు పాల్పడుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఉన్నతాధికారులే ఇలా ఉంటే.. కిందిస్థాయిలో ఇక చెప్పేదేముంది.

రూ. లక్ష.. యాభై.. పాతిక

అనంతపురం జిల్లాలో 12, శ్రీసత్యసాయి జిల్లాలో 9 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు ఉన్నాయి. వీటిలో అధిక డాక్యుమెంట్లు జరిగేది అనంతపురం, అనంతపురం రూరల్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లోనే. ఈ సీట్లకు డిమాండ్ ఎక్కువగానే ఉంటుంది. ప్రతి నెలా ఈ రెండు కార్యాలయాల నుంచి మేడమ్‌కు రూ.లక్ష చొప్పున వెళ్లాల్సిందే. కొన్ని సందర్భాల్లో రూ.1.50 లక్ష కూడా ఉండొచ్చట. ఇక ధర్మవరం, తాడిపత్రి, రాయదుర్గం, కదిరి, హిందూపురం, గుంతకల్లు, పెనుకొండ లాంటి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల నుంచి ప్రతి నెలా కనీసం రూ.50వేలు తప్పనిసరి అని సమాచారం. చిన్నస్థాయి రిజిస్ట్రేషన్ కార్యాలయాలైన శింగనమల, చెన్నేకొత్తపల్లి, కణేకల్లు, కళ్యాణదుర్గం లాంటి కార్యాలయాల నుంచి రూ.25వేలు ఉండాల్సిందేని తెలుస్తోంది. శ్రీసత్యసాయి జిల్లా పరిధిలో ఆ మేడమ్‌కు సైతం అందులో కొంత శాతం తగ్గించి నెల మామూళ్లు వెళ్తాయి.



గత ఏడాది రామ్‌నగర్ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో తనిఖీల అనంతరం మీడియాతో మాట్లాడుతున్న ఏసీబీ అధికారులు

ఇవ్వకపోతే తనిఖీలు

రిజిస్ట్రేషన్ శాఖకు ఆ మహిళా అధికారి వచ్చి నాలుగేళ్లవుతోంది. 2020లో వచ్చిన ఆ మేడమ్ 2022లో జూన్ నెల మాత్రమే బదిలీపై వెళ్లారు. ఆ వెంటనే తిరిగొచ్చారు. మేడమ్‌కు నెలనెలా ఆమ్యామ్యాలు అందకపోతే కథ చాలానే ఉంటుంది. సంబంధిత రిజిస్ట్రార్ కార్యాలయంలో తనిఖీలు చేస్తారు. వివాదాస్పద భూములు ఎలా రిజిస్ట్రేషన్ చేశారంటూ గట్టిగా నిలదీస్తారు. దీంతో ఆ తలనొప్పి తమకెందుకంటూ వచ్చిన మొత్తంలో ఆ మేడమ్‌కు వాటాలు ఇచ్చేస్తారని సమాచారం. మామూళ్ల విషయంలో సరిగా స్పందించకపోతే వివాదాలు వచ్చిన సమయంలో బదిలీలు అవలీలగా జరిగిపోతాయనే ప్రచారముంది. తప్పనిసరి బదిలీల్లో సేఫ్‌గా ఉండే సీట్లో కూర్చోబెట్టేందుకు మేడమ్ ఆశీస్సులు ఉంటాయనే మామూళ్లు వెళ్తాయని సమాచారం. గతంలో కర్నూలులో పనిచేసిన సమయంలో ఏసీబీకి అడ్డంగా దొరికిపోయారు. అప్పట్లో పెద్ద స్థాయిలోనే సిఫార్సులు నడిపినట్లు సమాచారం. చాలా అత్యవసర పరిస్థితుల్లో (మెటర్నిటీ) కూడా పూర్తిస్థాయిలో సెలవు తీసుకోలేదంటే ఆ మేడమ్‌కు నెల మామూళ్లపై ఎంత మమకారమో చెప్పనవసరం లేదు.

అక్కడ ఇవ్వాలంటే ఇక్కడ నొక్కాలి

అక్కడ ఇవ్వాలంటే ఇక్కడ నొక్కాలిగా అంటున్నారట సబ్‌రిజిస్ట్రార్లు. సజావుగా జరిగే ప్రతి రిజిస్ట్రేషన్‌కు రూ.500 నేరుగా సబ్‌రిజిస్ట్రార్‌కు చేరిపోతుందని సమాచారం. ప్రతి రోజు ఎన్ని డాక్యుమెంట్లు అయితే అన్ని రూ.500లే. ఏదైనా తిరకాసుంటే ఆ లెక్క వేరే ఉంటుంది. అనంతపురం పరిధిలో గత నాలుగేళ్లలో చుక్కల భూముల రిజిస్ట్రేషన్లు బాగానే జరిగాయి. ఒక్కో రిజిస్ట్రేషన్‌కు ఎకరాకు రూ.లక్ష పైమాటే వసూలు చేసినట్లు సమాచారం. ప్రస్తుతమూ అదే స్థాయిలో వ్యవహారం నడుపుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. కొన్ని భూములకు ఎమ్మెల్యేలు బ్రేక్ వేయడంతో ఆదాయం కొంత తగ్గినట్లు తెలుస్తోంది. 2023 జూలై 6న అనంతపురం రామ్‌నగర్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఏసీబీ దాడులు జరిగాయి. ఓ భవనం కోసం రూ.2లక్షలు డిమాండ్ చేయడంతో.. సబ్‌రిజిస్ట్రార్ సత్యనారాయణ, డాక్యుమెంట్ రైటర్, అతని అసిస్టెంట్ దొరికారు. ఈ సమయంలో ఆ సబ్‌రిజిస్ట్రార్ డైరీలో జిల్లా అధికారులకెలా మామూళ్లు ఎంతెంతివ్వాలో రాసుకున్నారనే ప్రచారం జరిగింది. ఆ తరువాత అనంతపురం రూరల్‌లో మహబూబ్ అలీ మేనల్లుడు డబ్బు తీసుకుంటూ ఏసీబీకి చిక్కాడు. శ్రీసత్యసాయి జిల్లాలో బుక్కపట్నం సబ్ రిజిస్ట్రార్‌దీ అదే పరిస్థితి. ఆ తరువాత ఆయన చెన్నైలో ఆత్మహత్య చేసుకున్నారు.

మొదలైన దాడి

- వేరుశనగలో తెగుళ్ల ఉధృతి
- ఆందోళనలో అన్నదాతలు



తెగుళ్లబారిన పడిన వేరుశనగ పంట, (ఇన్‌సెట్‌లో) వేరుశనగ మొక్కను ఆశించిన పురుగులు

ధర్మవరంరూరల్, ఆగస్టు5: ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసిన వేరుశనగ పంటకు అప్పుడే తెగుళ్ల దాడి మొదలైంది. ఒకేసారి పలు రకాల తెగుళ్లు దాడిచేయడంతో పంట వృద్ధి చెందడం లేదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మండలంలో నాలుడు వేల ఎకరాల్లో వేరుశనగ సాగు చేసినట్లు అధికారులు తెలిపారు. పంట సాగుచేసి దాదాపు 20 నుంచి 25రోజులు కావొస్తోంది. ప్రస్తుతం పంటకు ఆకుపచ్చపురుగు, ఆకుముడత, లద్దెపురుగు ఆశించాయి. ఆకులపై తెల్లమచ్చలు ఏర్పడటంతో పంట ఎదుగుదలపై ప్రభావం చూపుతోంది. ఆకుపచ్చ పురుగుతో ఆకులన్నీ రంధ్రాలు పడినట్లు రైతులు పేర్కొంటున్నారు. వేరుశనగకు ఆదిలోనే తెగళ్లు ఆశించడంతో రైతులు రసాయనిక మందులు పిచికారీ చేస్తున్నారు. అయితే వాతావరణ మార్పులతో ఆ మందులు పనిచేయడం లేదని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వేలకు వేలు వెచ్చించి మందులు పిచికారి చేసినా తెగుళ్ల నుంచి విముక్తి కలగడం లేదని రైతులు ఆందోళన చెందుతున్నారు. వేరుశనగ సాగుకు ఎకరాకు 20వేల వరకు పెట్టుబడి పెట్టామని, తెగుళ్ల బెడదతో ఏమాత్రం పంట చేతికొస్తుందో అంతుబట్టడం లేదని రైతులు వాపోతున్నారు.

మందులు పిచికారీ చేయాలి: ముస్తఫా, ఏఓ, ధర్మవరం



వేరుశనగలో తెగుళ్లను సకాలంలో గుర్తించి మందులను పిచికారీ చేసుకోవాలి. పచ్చపురుగు, లద్దెపురుగు నివారణకు ప్రోఫినోపాస్ 2ఎంఎల్, లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలి. ఆకుముడ త, రసంపీల్చే పురుగుల నివారణకు కాన్ఫిడార్ 1ఎంఎల్, లీటర్‌నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలి. పూత దశలో ఉన్న వేరుశనగకు ఎకరాకు 200కేజీల జిప్సం వేసు కుంటే నాణ్యమైన దిగుబడి, విత్తనంలో నూనె శాతం పెరుగుతుంది.

నేల తల్లికి పచ్చ బొట్లు

హెచ్చెల్సీ ఆయకట్టు కింద జోరుగా వరినాట్లు



దేవగిరి క్రాస్ సమీపంలో నాట్లు వేస్తున్న కూలీలు

బొమ్మనహాళ్, ఆగస్టు 5: మండలంలో ఖరీఫ్ వరినాట్లు ప్రారంభమయ్యాయి. గ్రామాల్లో బోరునీటి సౌకర్యం ఉన్న రైతులు నాట్లు ప్రారంభించారు. తుంగభద్ర జలాశయం నుంచి హెచ్చెల్సీకి సాగునీరు విడుదలైన నేపథ్యంలో కాలువలో సమృద్ధిగా నీరు ప్రవహిస్తోంది. దీంతో ఆయకట్టు రైతులు వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యారు. కాల్వలు, బోర్ల కింద వరినాట్లు వేసేందుకు పొలాలను సిద్ధం చేస్తున్నారు. మండలంలోని ఉంతకల్లు, రంగాపురం క్యాంప్, దేవగిరి క్రాస్ తదితర గ్రామాల్లో వరినాట్లు జోరందుకున్నాయి. ఈ వారంలో వర్షాలు మరింతగా కురిస్తే తొలకరి వరినాట్లు మరింత వేగం పుంజుకుంటాయి. హెచ్చెల్సీకి తుంగభద్ర జలాలు రావడంతో ఉత్సాహంతో సాగు పనులు ప్రారంభించారు. దీంతో పంట పొలాలన్నీ రైతులు, కూలీలతో కళకళలాడుతున్నాయి.

ప్రత్యామ్నాయ పంటల సాగుకు సాయం చేయండి

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ



పంటలను పరిశీలిస్తున్న సీపీఐ నాయకులు

అనంతపురంరూరల్, ఆగస్టు 5: ప్రత్యామ్నాయ పంటల సాగుకు ప్రభుత్వం సాయం చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ అన్నారు. మండలంలోని మన్నీల గ్రామ సమీపంలో వర్షాలు లేక దెబ్బతింటున్న పంటలను సోమవారం ఆయన పార్టీ నాయకులతో కలిసి పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ..ఉత్తరాది రాష్ట్రాలు, కేరళలో తుపానులతో జనాలు బెంబేలెత్తుతున్నారన్నారు. రాయలసీమలో ఇందుకు భిన్నమైన పరిస్థితులు నెలకొన్నాయన్నారు. వర్షాలు కురవకపోవడంతో పంట సాగు చేయని పరిస్థితులున్నాయన్నారు. సాగు చేసిన పంటలు వర్షాభావ పరిస్థితుల కారణంగా దెబ్బతింటున్నాయన్నారు. ఎన్నికలకు ముందు ముఖ్యమంత్రి చెప్పిన విధంగా రైతులకు రూ.20వేలు ఇవ్వాలన్నారు. వెంటనే 90శాతం సబ్సిడీతో ప్రత్యామ్నాయ విత్తనాలు అందించాలన్నారు. తుంగభద్ర, శ్రీశైలం డ్యాంలో నీరు పుష్కలంగా ఉన్నాయి కావున హంద్రీనీవా కెనాల్, పీఏబీఆర్ కెనాల్‌కి పూర్తి సాయిలో నీటినందించి చెరువులను నింపాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జగదీష్, రైతు సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షులు రామచంద్రయ్య, సీపీఐ జిల్లాకార్యదర్శి జాఫర్, నారాయణస్వామి, మల్లికార్జున, కార్యదర్శి వర్గ సభ్యులు రాజారెడ్డి, రామకృష్ణ, రైతు సంఘం నాయకులు బుల్లె నగేష్, వెంకటనారాముడు, చిన్న వెంకటరాముడు, శివ, ఆంజనేయులు, నిరంజన్ పాల్గొన్నారు.

నేడు ఆర్‌జేడీ సమీక్ష

అనంతపురం విద్య, ఆగస్టు 5: పాఠశాల విద్యాశాఖ కడప ఆర్‌జేడీ శామ్యూల్ మంగళవారం జిల్లాకు రానున్నారు. అనంతపురం ఉమ్మడి జిల్లాల డీఈఓలు, డిప్యూటీ డీఈఓలు, ఎంఈఓలు 1-,2లతో నగర శివారులోని ఆర్డీటీ ఆడిటోరియంలో మంగళవారం మధ్యాహ్నం సమావేశం నిర్వహించనున్నారు. రెండు జిల్లాల అధికారులు ఈ సమీక్షకు హాజరుకానున్నారు. ఈ సందర్భంగా ఆయన పలు విద్యాశాఖ అంశాలపై వారితో సమీక్ష నిర్వహిస్తారని జిల్లా అధికారులు తెలిపారు.

మిర్చి రైతు కష్టం దొంగలపాలు

- పంట అమ్మిన సొమ్మును చోరీ చేసిన దుండగులు
- ద్విచక్రవాహనం బ్యాగులో ఉంచిన రూ.3.5 లక్షలు అపహరణ
- ఉరవకొండలో పట్టపగలే చోరీ



చోరీ వివరాలను వెల్లడిస్తున్న బాధితుడు

ఉరవకొండ, ఆగస్టు 5: పట్టణంలోని గవిమఠం ఆవరణలో ద్విచక్రవాహనంలో ఉంచిన రూ.3.5 లక్షలను గుర్తుతెలియని వ్యక్తులు చోరీ చేశారు. విడపనకల్లు మండలం ఉండబండకు చెందిన రైతు వేణుకు ఉరవకొండలోని ఎస్‌బీఐ ఖాతాలో మిర్చి పంటకు సంబంధించిన డబ్బు జమ అయ్యాయి. వాటిని డ్రా చేసుకునేందుకు సోమవారం బ్యాంకుకు వెళ్లాడు. బ్యాంకులో బంగారంపై ఉన్న రుణాన్ని చెల్లించి, మిగిలిన రూ.3.5 లక్షలు డ్రా చేసుకుని, ద్విచక్రవాహనం బ్యాగులో ఉంచాడు. అక్కడి నుంచి గవిమఠం ఆవరణలో ఆయన తల్లిదండ్రులు బీరువా ఆర్డర్ ఇస్తుండగా అక్కడకు వెళ్లాడు. ద్విచక్రవాహనాన్ని బయట ఆపి కుటుంబసభ్యులతోపాటు లోపలికి వెళ్లాడు. బయటకు వచ్చి ద్విచక్రవాహనానికి ఉన్న బ్యాగుని చూడగా అందులో ఉన్న డబ్బు మాయమైంది. ఈ విషయాన్ని పోలీసులకు సమాచారమివ్వగా.. వారు అక్కడకు చేరుకుని విచారణ చేపట్టారు. సమీపంలో ఉన్న దుకాణాలలోని సీసీ ఫుటేజీ ద్వారా దొంగలను గుర్తించే ప్రయత్నాలు చేశారు. ముగ్గురు వ్యక్తులు వెంబడించి చోరీకి పాల్పడినట్లు పోలీసులు ప్రాథమికంగా గుర్తించారు. బాధితుల ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేపట్టారు.

దోపిడీయే వారి పని

- ఏటీఎంలను కొల్లగొట్టడమే లక్ష్యం
- చోరీల్లో ప్రత్యేక శిక్షణ
- రెండు నెలల్లో జిల్లాలో మూడు ఘటనలు
- హరియాణా మేవాత్‌వాసుల పనే
- రికవరీ ఆషామాషీ కాదట..!



అనంతపురం క్రైం, ఆగస్టు 5: ఆ ఊరివాళ్లంతా ఏటీఎంల దోపిడీయే లక్ష్యంగా పని చేస్తున్నారు. గ్యాస్ కట్టర్‌లతో చాకచక్యంగా ఏటీఎంలను కట్ చేసి అందులో ఉన్న సొమ్మంతా దోపిడీ చేస్తున్నారు. వీరు సాధారణంగా పెద్ద మొత్తంలో డబ్బు ఉంచే ఏటీఎంలనే టార్గెట్ చేస్తారు. ఇందుకు వారికి ప్రత్యేక శిక్షణ సైతం ఇస్తారు. ఇదంతా హరియాణా రాష్ట్రంలోని మేవాత్ ప్రాంతంలో జరిగే వ్యవహారం. ఇక్కడి యువకులు కొంతమంది ఇతర రాష్ట్రాల కు వెళ్లి ఎస్‌బీఐ లాంటి ప్రధాన బ్యాంకులకు సంబంధించిన ఏటీఎంలను కొల్లగొట్టి అక్కడి నుంచి క్షణాల్లో ఉడాయిస్తారు. జిల్లా పోలీసులకు ఈ దొంగల వ్యవహారం తలనొప్పిగా మారింది. గతం లో హవాలా మనీ దొంగిలించిన కేరళ వారిని పట్టుకోవడానికి జిల్లా పోలీసులు నానా తిప్పలు పడ్డారు. ఇప్పుడు హరియాణాకు వెళ్లినా ఆ దొంగల నుంచి డబ్బు రికవరీ అంత ఈజీ కాదని తెలుస్తోంది. పోలీసుల విచారణలో ఇవన్నీ నిందితులే చెప్పినట్లు తెలిసింది.

రెండు నెలల్లో మూడు ఘటనలు

ఇటీవల జిల్లా కేంద్రంలోని రామ్‌నగర్ ప్రధాన రహదారిలో ఎస్‌బీఐ ఏటీఎంను గ్యాస్ కట్టర్‌తో కత్తరించి రూ.30లక్షలు ఎత్తుకెళ్లిన ఘటన కలకలం రేపింది. ఇలాంటి ఘటనలు మరో రెండు జరిగాయి. ఈనెల 2న తెల్లవారుజామున గార్లదిన్నె మండలం కల్లూరులో ఎస్‌బీఐ ఏటీఎంను ఇదే రీతిలో కొల్లగొట్టారు. రూ.3.28లక్షలు ఎత్తుకెళ్లారు. కూడేరులో జూన్ 8 అర్ధరాత్రి ఏటీఎంలో చోరీ జరిగింది. అందులో నుంచి రూ.18,41,300లు ఎత్తుకెళ్లారు. మొత్తంగా రెండు నెలల్లోనే రూ.60లక్షల వరకు ఎత్తుకెళ్లారు. కల్లూరు, కూడేరు ఘటనల్లో ఇంకా దొంగలు దొరకనేలేదు. తాజాగా జరిగిన ఏటీఎం చోరీతో పాటు కల్లూరు, కూడేరు ఘటనల్లోనూ హరియాణాలోని మేవాత్ ప్రాంత వాసుల హస్తం ఉన్నట్లు తేలింది. ఐదేళ్ల క్రితం జేఎన్‌టీయూ సమీపంలోని ఎస్‌బీఐ బ్యాంకుకే కన్నం వేశారు. ఆ సందర్భంలో కేవలం కొంత మాత్రమే రికవరీ అయింది.

రికవరీ కష్టమేనట...

రామ్‌నగర్‌లోని ఏటీఎం చోరీచేసిన ఘటనలో పాల్గొన్న ముగ్గురు దొంగలు గంటల వ్యవధిలోనే కర్ణాటక రాష్ట్రంలోకి చేరుకున్నారు. డబ్బు తీసుకెళ్లడానికి కారు ఉపయోగించారు. వీరంతా వేర్వేరు బృందాలుగా ఉంటారని సమాచారం. కొందరు బెంగళూరు నుంచి నేరుగా విమానంలో వెళ్తారని సమాచారం. ఇక చోరీ చేసిన సొమ్మును రైలులో తరలిస్తారని తెలిసింది.

రామ్‌నగర్ ఏటీఎం దోపిడీ ఘటనలో పాల్గొన్న దొంగల్లో ఇద్దరు పట్టుబడ్డారు. అప్పటికే వారి నుంచి డబ్బు మాయమైంది. ఆ మూడో దొంగ ఆ డబ్బును మరో బృందానికి అందజేసినట్లు సమాచా రం. వారి నుంచి రికవరీ చేయడం ఆషామాషీ కాదని సమాచారం. పోలీసులకు పట్టుబడితే ఆ దొంగలు కట్టుకథలు చెబుతారని కానీ డబ్బు మాత్రం ఇవ్వరట. ఆ డబ్బు కాల్చేశామని, ఎక్కడో నీటి ప్రవాహంలో పడేశామని, ట్రైన్‌లో బ్యాగ్ మర్చిపోయామని చెబుతారట. ఇక కోర్టు పరిధిలో లీగల్‌గా పోలీసులకే తలనొప్పులు తెచ్చేలా వ్యవహరిస్తారని సమాచారం. ఆ దొంగల నుంచి రికవరీ చేయాలంటే పోలీసులకు తలపోటు తప్పదని తెలుస్తోంది. మరి మూడు చోరీలకు సంబంధించి రూ.60లక్షల రికవరీ చేయడం అనంత పోలీసులకు సవాలే.

చంద్రబాబు మార్క్ పాలన చూపిస్తున్నారు

● ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్

అనంతపురం అర్బన్, ఆగస్టు 5: సీఎం చంద్రబాబు తన మార్క్ పాలన ఏంటో చూపిస్తున్నారని ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ ఒక ప్రకటనలో అన్నారు. కలెక్టర్ల సదస్సులో ప్రతి నెలా ఒకటో తేదీన 'పేదల సేవ'లో అనే కార్యక్రమాన్ని చేపట్టాలని నిర్ణయించడం అద్భుతమన్నారు. దేశంలో ఏ సీఎం ఇలాంటి ఆలోచన చేయలేదన్నారు. పేదరిక నిర్మూలనకు కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందన్నారు. పూర్ టూ రిచ్ అనే నినాదాన్ని ఎన్నికల హామీలో చంద్రబాబు ఇచ్చారని, అందుకే ఈ కార్యక్రమాన్ని తీసుకొచ్చారన్నారు. పేదల జీవితాల్లో మార్పు తెచ్చేలా ఈ కార్యక్రమం నిర్వహణ ఉంటుందన్నారు. అలాగే సూపర్-6 పథకాలకు కట్టుబడి ఉన్నామని సీఎం కలెక్టర్ల సదస్సులో మరోసారి స్పష్టం చేశారన్నారు. ఇప్పటికే ఐదు హామీలను అమలుపర్చామని, వంద రోజుల్లో కూటమి మార్క్ ప్రభుత్వాన్ని చూస్తారని ఎమ్మెల్యే పేర్కొన్నారు.

అనంతపురం అర్బన్ తహసీల్దార్‌గా హరికుమార్



బాధ్యతలు స్వీకరిస్తున్న హరికుమార్

అనంతపురంరూరల్, ఆగస్టు 5: అనంతపురం అర్బన్ తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్‌గా హరికుమార్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఎన్నికల మందు నార్పల తహసీల్దార్‌గా పని చేశారు. ఎన్నికల బదిలీ నేపథ్యంలో చిత్తూరుకు బదిలీ అయ్యారు. ఇటీవల జరిగిన బదిలీల్లో తిరిగి అనంతపురానికి కేటాయించారు. అనంతపురం అర్బన్ తహసీల్దార్‌గా కలెక్టర్ నియమించారు. పలువురు అధికారులు, ఉద్యోగులు సిబ్బంది పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. డిప్యూటీ తహసీల్దార్ పునీత్, ఆర్ఐ సందీప్, వీఆర్వోలు పాల్గొన్నారు.

పలువురు తహసీల్దార్లు బాధ్యతల స్వీకరణ

న్యూస్ నెట్‌వర్క్: జిల్లాలో పలువురు తహసీల్దార్లు బాధ్యతలు చేపట్టారు. శింగనమల తహసీల్దార్‌గా బ్రహ్మయ్య సోమవారం బాధ్యతలు స్వీకరించారు. విడపనకల్లు తహసీల్దార్‌గా పనిచేస్తున్న ఆయన ఎన్నికల బదిలీల్లో కర్నూలు జిల్లాకు బదిలీ అయ్యారు. అనంతరం అనంతపురం జిల్లాకు కేటాయించారు. నార్పల తహసీల్దార్‌గా అరుణకుమారి బాధ్యతలు చేపట్టారు. ఆమెకు కార్యాలయ సిబ్బంది పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు. గార్లదిన్నె తహసీల్దార్‌గా బండారు ఈశ్వరయ్య బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న తహసీల్దార్ లోకేశ్వరి బదిలీపై చిత్తూరు జిల్లాకు వెళ్లారు. విడపనకల్లు తహసీల్దార్‌గా పనిచేస్తున్న ఈశ్వరమ్మ ఇక్కడ నియమితులయ్యారు. రామగిరి తహసీల్దార్‌గా జమానుల్లాఖాన్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఆయనకు డీటీ నరేష్‌బాబు, ఆర్ఐ నరసింహమూర్తి, వీఆర్వోలు, సిబ్బంది పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. అలాగే రాప్తాడు తహసీల్దార్‌గా విజయకుమారి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఆమెకు టీడీపీ నాయకులు నారాయణస్వామి, గోపాల్, సర్పంచ్ తిరుపాలు తదితరులు శుభాకాంక్షలు తెలిపారు.

తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన అవసరం



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న పీడీ, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు

అనంతపురం క్లాక్‌టవర్, ఆగస్టు 5: తల్లిపాల ప్రాముఖ్యతపై ప్రతి తల్లీ కనీస అవగాహన కలిగి ఉండాలని ఐసీడీఎస్ పీడీ శ్రీదేవి అన్నారు. ఎస్ఆర్ ఎడ్యుకేషనల్ సొసైటీ, ప్రగతిపథం యూత్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో రూపొందించిన ప్రపంచ తల్లిపాల వారోత్సవాల అవగాహన పోస్టర్లను సోమవారం ఐసీడీఎస్ కార్యాలయంలో ఆ ప్రతినిధులతో కలిసి పీడీ విడుదల చేశారు. పుట్టిన ప్రతి బిడ్డకు తల్లిపాల అవసరాన్ని ఆమె వివరించారు. తల్లిపాల వారోత్సవాలపై యువత ముందుకు రావడం అభినందనీయమన్నారు. జాతీయ అవార్డు గ్రహీత భరత్, రాష్ట్రపతి అవార్డు గ్రహీతలు జీవన్‌కుమార్, జయమారుతి, డీసీపీఓ మంజునాథ, ఎంఎస్ఎస్ రాష్ట్ర స్థాయి అవార్డు గ్రహీత నందిత, సభ్యులు రాజా, పవన్, దోని పాల్గొన్నారు.

శింగనమల: తల్లిపాలు అమృతం లాంటివని, పుట్టిన వెంటనే బిడ్డలకు పాలివ్వడం ఆరోగ్యకరమని ఐసీడీఎస్ సూపవైజర్ ఉమాదేవి అన్నారు. సోమవారం మండలంలోని శివపురం అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాలవారోత్సవాల సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

ప్రాణత్యాగాల ఫలితమే ఎస్సీ వర్గీకరణ

● ఎమ్మెస్పీ జిల్లా అధ్యక్షుడు కదిరప్ప

అనంతపురం సెంట్రల్, ఆగస్టు 5: ఎంతోమంది ప్రాణత్యాగాల ఫలితమే ఎస్సీ వర్గీకరణ సఫలీకృతం అవవుతోందని ఎమ్మార్పీఎస్ అనుబంధ ఎమ్మెస్పీ జిల్లా అధ్యక్షుడు బండారు కదిరప్ప పేర్కొన్నారు. వర్గీకరణ ఉద్యమంలో అసువులు బాసిన కుటుంబ సభ్యులను సోమవారం ఉపాధ్యాయ భవనంలో ఘనంగా సన్మానించారు. కదిరప్ప మాట్లాడుతూ మందకృష్ణ మాదిగ సమక్షంలో సాగించిన నిరంతర ఉద్యమంలో అనేకమంది కార్యకర్తలు ఆయన వెంటనడిచారని తెలిపారు. ఇందులో భాగంగా తెల్లబండ్ల రవి మాదిగ తన ఒంటిపై కిరోసిన్ పోసుకుని ప్రాణత్యాగం చేశారన్నారు. త్యాగానికి గుర్తుగా రవి భార్య విజయ రంగమ్మను సన్మానించడం వర్గీకరణ సాధనకు నిదర్శనమన్నారు. కార్యక్రమంలో నాయకులు నాగభూషణం, బానాని శీను, బేడ బుడగ జంగాల నాయకు లు అంజి, శాంతకుమారి, రేఖలకుంట రామాంజనేయులు పాల్గొన్నారు.

రైతులు పంట నమోదు చేసుకోవాలి

నార్పల, ఆగస్టు 5: ఖరీఫ్ 2024సంవత్సరానికి పంట సాగుచేసిన రైతులు పంట నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి సీ చన్నవీరస్వామి సోమవారం ఒక ప్రకటనలో సూచించారు. పంట నమోదు చేసుకోవడం వల్ల పంటలు దెబ్బతింటే ప్రభుత్వం పెట్టుబడి రాయితీ, పంటల బీమా సొమ్ము, పంటల మీద తీసుకున్న రుణాల మీద వడ్డీ మాఫీ లభిస్తుందన్నారు. 30లోపు పంట నమోదు చేసుకోవాలని ఆయన కోరారు.

ఉపాధ్యాయుల సర్దుబాటు నిలిపివేయాలి

రాప్తాడు, ఆగస్టు 5: జీఓ 117 ఆధారంగా పని సర్దుబాటు చేయడం వల్ల ఉపాధ్యాయులు తీవ్రంగా నష్టపోతున్నారని, వెంటనే నిలిపివేయాలని ఏపీటీఎఫ్ పూర్వ రాష్ట్ర కార్యదర్శి నరసింహులు, జిల్లా కార్యదర్శి సిరాజుద్దీన్ కోరారు. రాప్తాడు జిల్లా పరిషత్ పాఠశాలలో సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పాల్గొని వారు మాట్లాడారు. విద్యా రంగానికి నష్టం కలిగించే జీఓ 117ను వెంటనే రద్దు చేయాలన్నారు. తక్కువ మంది విద్యార్థులున్న పాఠశాలలను మూసివేయరాదన్నారు. అర్హత కలిగిన ఉపాధ్యాయులకు ఉద్యోగోన్నతులు కల్పించడం ద్వారా భర్తీ చేయాలన్నారు. విద్యాశాఖకు సంబంధించి నిర్ణయాలు తీసుకునే ముందు ఉపాధ్యాయ సంఘాలతో చర్చించాలన్నారు. ఏపీటీఎఫ్ నాయకులు ఓబిలేసు, ఆంజనేయులు, కదిరప్ప పాల్గొన్నారు.

ఘనంగా గుడిసె దేవానంద్ జన్మదినం

అనంతపురం సెంట్రల్, ఆగస్టు 5: బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు గుడిసె దేవానంద్ జన్మదిన వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు ప్రభుకుమార్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు సాకే శివశంకర్ ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. నాలుగు దశాబ్దాలుగా బీజేపీలో వివిధ స్థాయిలో పనిచేసిన గుడిసె దేవానంద్ ప్రజా సమస్యల పరిష్కారంలో ఎనలేని కృషిచేశారని వారు కొనియాడారు. జాతీయ స్థాయిలో పదవులు అలంకరించి మరిన్ని సేవలందించాలని ఆకాంక్షించారు. నాయకులు మహేష్, మణికంత, మార్కండేయ, మంజు పాల్గొన్నారు.



రోగులకు పండ్లు, బ్రెడ్లు అందజేస్తున్న ఎస్సీ మోర్చా నాయకులు

సూపర్ సిక్స్ పథకాలకు ప్రభుత్వం కట్టుబడి ఉంది

● రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత



ఎమ్మెల్యే పరిటాల సునీతను కలిసిన పార్టీ కార్యకర్తలు, మహిళలు

అనంతపురం అర్బన్, ఆగస్టు 5: సూపర్ సిక్స్ పథకాల అమలుకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఎమ్మెల్యే పరిటాల సునీత అన్నారు. సోమవారం అనంతపురంలోని తన క్యాంపు కార్యాలయంలో అధికారులు, పార్టీ నాయకులు ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిశారు. పలువురు అధికారులతో ఆమె పలు అంశాలపై సమీక్షించారు. అలాగే ప్రజలు, కార్యకర్తలతో స్థానికంగా నెలకొన్న సమస్యలు అడిగి తెలుసుకొని, వాటి పరిష్కారానికి చర్యలు చేపట్టారు. ఎమ్మెల్యే పరిటాల సునీత మీడియాతో మాట్లాడుతూ... గత ఐదేళ్లలో ఐఏఎస్, ఐపీఎస్‌ల గౌరవం తగ్గించేలా పాలన సాగిందని, కానీ తమ ప్రభుత్వంలో సీఎం చంద్రబాబునాయుడు తొలి సమావేశంలోనే వారికి గౌరవం తెచ్చేలా నిర్ణయాలు తీసుకున్నారన్నారు. అధికారులంటే పాలకులకు సేవకులు కాదని, ప్రజలకు సేవకులన్న విషయాన్ని సీఎం స్పష్టంగా చెప్పారన్నారు. సూపర్‌సిక్స్ పథకాల అమలుపై వైసీపీ నాయకుల విమర్శలకు సీఎం క్లారిటీ ఇచ్చారన్నారు. ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తామని, వంద రోజుల ప్రణాళికలతో ముందుకు వెళుతున్నామన్నారు. పేదరిక నిర్మూలనలో భాగంగా ప్రతి నెలా ఒకటో తేదీన పేదల సేవలో పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని తీసుకురావడం హర్షణీయమన్నారు. అధికారులు నేరుగా పేద వర్గాలను కలవడం ద్వారా వారు ఎదుర్కొనే అనేక రకాల సమస్యలు పరిష్కారం అయ్యే అవకాశం ఉందన్నారు. ఆ దిశగా సీఎం కలెక్టర్లకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారన్నారు. తమ ప్రభుత్వం ఖచ్చితంగా అభివృద్ధి, సంక్షేమంతో పాటు అన్ని వర్గాలను ఉన్నత స్థాతికి తీసుకొచ్చేలా చొరవ చూపుతుందన్నారు.

చంద్రబాబు ప్రజాపాలన అందిస్తున్నారు

● టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి ప్రభాకర్ చౌదరి



మీడియాతో మాట్లాడుతున్న వైకుంఠం ప్రభాకర్ చౌదరి

అనంతపురం అర్బన్, ఆగస్టు 5: సీఎం చంద్రబాబు ప్రజాపాలన అందిస్తున్నారని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి వైకుంఠం ప్రభాకర్ చౌదరి అన్నారు. సోమవారం స్థానిక రాం నగర్‌లోని తన క్యాంపు కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. గత ఐదేళ్లలో అధోగతిపాలైన ఆర్థిక పరిస్థితిని గాడిలో పెట్టి రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించే సత్తా చంద్రబాబుకు ఉందన్న నమ్మకంతో ప్రజలంతా అఖండ మెజార్టీతో కూటమిని గెలిపించారన్నారు. గత ఐదేళ్ల పాలనలో ప్రజలను ఏ మాత్రం పట్టించుకోని వైసీపీ నాయకులుతమ ప్రభుత్వం పాలన రెండు మాసాలు పూర్తి కాకముందే హామిలు ఏమయ్యాయి..? నెరవేరుస్తారా..? లేదా అంటూ సందేహాలు, అనుమానాలతో మాట్లాడుతూ కపట రాజకీయాలు చేస్తున్నారని మండిపడ్డారు. ఈనెల 15 నుంచి అన్న క్యాంటీన్లు ప్రారంభమవుతాయన్నారు. అమరావతి పునః నిర్మాణం జరుగుతోందన్నారు. మా ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి గంజాయిని ఉక్కుపాదంతో అణచివేస్తోందన్నారు. కేవలం 50 రోజుల్లోనే ఇన్ని హామీలు అమలు చేశారంటే సీఎం ప్రజాపాలన అందిస్తున్నారనేందుకు ఇంతకంటే తార్కాణం ఏం కావాలన్నారు. తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల్లో ఆయా ప్రభుత్వాలు 6 నుంచి 8 మాసాల్లో హామీలు నెరవేర్చారన్నారు. జగన్ పాలనలో రాష్ట్రం అప్పులకుప్పగా మారిందన్నారు. గత ప్రభుత్వంలో మాదిరిగా కక్షసాధింపు చర్యలతో ఇతర పార్టీ నాయకులపై దాడిచేస్తే సహించేది లేదని, ఎవరూ కవ్వింపు చర్యలకు పాల్పడకూడదని సీఎం స్పష్టం చేశారన్నారు. రాష్ట్ర ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని ప్రజా ప్రభుత్వానికి అన్ని రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాల నాయకులు సహకరించాలని కోరారు.

ప్రభుత్వం.. రైతులను ఆదుకోవాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న సీపీఐ నాయకులు

చెన్నేకొత్తపల్లి, ఆగస్టు 5: తీవ్ర వర్షాభావ పరిస్థితుల్లో కరువు నెలకొన్న దృష్ట్యా ప్రభుత్వం రైతులను ఆదుకోవాలని సీపీఐ నాయకులు కోరారు. మండల కార్యదర్శి నాగరాజు, ముత్యాలప్ప, రాము తదితరులు సోమవారం తహసీల్దార్ హమీద్‌బాషాను కలిసి వినతిపత్రం అందజేశారు. రైతులకు సబ్సిడీతో వ్యవసాయ పరికరాలు, తెలంగాణ ప్రభుత్వ తరహాలో రూ.2లక్షల రుణాలను రద్దుచేయాలన్నారు. అంతేకాకుండా ప్రతిరైతుకు రూ.20వేలు పెట్టుబడిసాయం అందించాలన్నారు. నరసింహులు, పెద్దన్న, అశోక్ పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలి

శింగనమల, ఆగస్టు 5: ఉపాధి కూలీలకు పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలని సీపీఐ జిల్లా సమితి నాయకుడు తరిమెల రామాంజనేయులు డిమాండ్ చేశారు. సోమవారం శింగనమల తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్‌కు వినతి పత్రం అందించారు. అయన మాట్లాడుతూ పనులు చేసిన 8 వారాలకు సంబంధించిన బిల్లులు ఇంకా జమకాలేదని వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఓంకార్, శ్రీరాములు, లక్ష్మీరంగయ్య నాగరాజు పాల్గొన్నారు.

జాతీయ ఫుట్‌బాల్ పోటీల్లో ఆంధ్రా హవా



రెండో విజయం నమోదు చేసిన ఆంధ్రా బాలికల ఫుట్‌బాల్ జట్టు

అనంతపురం క్లాక్‌టవర్, ఆగస్టు 5: జాతీయ ఫుట్ బాల్ బాలికల పోటీల్లో ఆంధ్రా జట్టు హవా కొనసాగిస్తోంది. ఫుట్‌బాల్ అండర్-14 చాంపియన్‌షిప్ పోటీలు మూడో రోజు సోమవారం అనంత క్రీడా గ్రామం ఆర్డీటీ స్టేడియంలో కొనసాగాయి. పోటీల్లో బీహార్‌పై ఆంధ్రా జట్టు విజయం సాధించింది. మరో మ్యాచ్‌లో హిమాచల్ ప్రదేశ్‌పై జార్ఖండ్ జట్టు గెలుపొందింది. విశ్రాంత జీఎస్‌డీఓ సుధాకర్, ఫుట్‌బాల్ అసోసియేషన్ డైరెక్టర్ రాజేష్, జిల్లా కార్యదర్శి మల్లేష్ పాల్గొన్నారు.

పాఠశాల ఎన్నికలు సక్రమంగా నిర్వహించండి

రాప్తాడు, ఆగస్టు 5: మండలంలో 8వ తేదీన అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో నిర్వహించే కమిటీ చైర్మన్ ఎన్నికలు సక్రమంగా నిర్వహించాలని ఎంఈఓ మల్లికార్జున సూచించారు. స్థానిక ఎంఆర్‌పీ కార్యాలయంలో అన్ని ప్రభుత్వ పాఠశాలల హెచ్‌ఎంలతో సమావేశం నిర్వహించారు. ఎంఈఓ మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనల మేరకు ఎన్నికలు నిర్వహించాలన్నారు.

పాడి రైతులను ఆదుకోండి



తహసీల్దార్‌కు వినతి పత్రం ఇస్తున్న రైతు సంఘం నాయకులు

రాప్తాడు, ఆగస్టు 5: అమూల్ పాల డెయిరీ వల్ల నష్టపోతున్న పాడి రైతులను ఆదుకోవాలని రైతు సంఘం నాయకులు డిమాండ్ చేశారు. గత ప్రభుత్వంలో అమూల్ డెయిరీ ఏర్పాటు చేసి జిల్లాలో 100 కేంద్రాల ద్వారా పాలు సేకరించిందన్నారు. ప్రస్తుతం ఆ యాజమాన్యం ప్రస్తుతం పాలు సేకరించమని చెబుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. సమస్యను పరిష్కరించాలని సోమవారం తహసీల్దార్ విజయకుమారికి నాయకులు వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వమే పాలు సేకరించాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా కార్యదర్శి చంద్రశేఖరరెడ్డి, పోతులయ్య పాల్గొన్నారు.

ప్రభుత్వాస్పత్రి వద్ద అన్నదానం



ఆస్పత్రి వద్ద అన్నదానం చేస్తున్న టీఎన్ఎస్ఎఫ్ నాయకులు

అనంతపురం అర్బన్, ఆగస్టు 5: కళ్యాణదుర్గం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు జన్మదినాన్ని పురస్కరించుకుని సోమవారం అనంతపురం ప్రభుత్వాస్పత్రి వద్ద టీఎన్ఎస్ఎఫ్ నాయకులు అన్నదానం చేశారు. టీఎన్ఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి బాలా లోకేశ్ యాదవ్, నాయకులు హరికృష్ణ, రాంభూపాల్, రఘు, కదిరేష్, వంశీ పాల్గొన్నారు.

ఫిజికల్ డైరెక్టర్‌కు సన్మానం



జబీవుల్లాను సన్మానిస్తున్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు

అనంతపురం సెంట్రల్, ఆగస్టు 5: ఆర్ట్స్ కళాశాల ఫిజికల్ డైరెక్టర్‌గా రిటైర్ అయిన జబీవుల్లాను సోమవారం అమిటి క్రికెట్ క్లబ్ అండ్ వెల్ఫేర్ అసోసియేషన్ మేనేజర్ నారాయణస్వామి ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ప్రిన్సిపాల్ దివాకర్‌రెడ్డి మాట్లాడుతూ కళాశాలలో నిర్వహించే ప్రతి కార్యాక్రమాన్ని విజయవంతం చేయడంలో జబీవుల్లా కృషి చేసేవారని గుర్తుచేసుకున్నారు. శివారెడ్డి, మారుతీ ప్రసాద్, కుమార్, రాము, నరసింహ, లింగా పాల్గొన్నారు.

విద్యార్థులకు చదువు భారం కాకూడదు

● మానవ హక్కుల వేదిక చంద్రశేఖర్



మాట్లాడుతున్న మానవహక్కుల వేదిక చంద్రశేఖర్

అనంతపురం సెంట్రల్, ఆగస్టు 5: విద్యార్థుల భవిష్యత్తును నిర్దేశించే చదువులు ప్రభుత్వాల చర్యలతో వారికి భారంగా పరిణమిస్తున్నాయని, దీనికి నివారించాల్సిన బాధ్యత పాలకులపై ఉందని మానవ హక్కుల వేదిక రాష్ట్ర సభ్యులు చంద్రశేఖర్ అన్నారు. సోమవారం ఏఐఎస్ఎ ఆధ్వర్యంలో ఎస్ఎస్‌బీఎన్ కళాశాల నుంచి ఆర్ట్స్ కళాశాల వరకు స్టూడెంట్స్ మార్చ్‌ను నిర్వహించారు. అనంతరం ఏర్పాటుచేసిన సమావేశానికి చంద్రశేఖర్‌తోపాటు సీపీఐఎంఎల్ టీఏస్‌వలి, ఏఐఎస్ఏ అధ్యక్షుడు వేమన ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. వారు మాట్లాడుతూ ఉన్నత విద్యాకోర్సుల ప్రవేశాలకు జాతీయస్థాయిలో నేషనల్ టెస్ట్ ఏజెన్సీ(ఎన్‌టీఏ) సంస్థ పరీక్షలు నిర్వహిస్తోందన్నారు. ఈ ప్రక్రియలో పేపర్లను లీక్ చేసి ప్రతిభగల విద్యార్థుల భవిష్యత్తును కాలరాస్తున్నారని మం డిపడ్డారు. ఎన్‌టీఏను రద్దుచేసి నీట్, జేఈఈ వంటి ఉమ్మడి ప్రవేశ పరీక్షలను స్థానికంగా ఆయా రాష్ట్రాలు నిర్వహించుకునేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో మరిన్ని ఉద్యమాలు చేయాల్సి వస్తుందని హెచ్చరించారు. నాయకులు పరశురాం, సుజాత, శివకుమార్, బాలకృష్ణ, రాజునాయక్, వంశీకృష్ణ, హేమంత్, మహేష్, అరవింద్, రమణ పాల్గొన్నారు.

కృష్ణా, గోదావరి జలాల పునఃపంపిణీ చేయాలి

● రైతు సంఘం డిమాండ్ ● నాయకుల ఆందోళన



మాట్లాడుతున్న మల్లికార్జున

అనంతపురం విద్య, ఆగస్టు 5: కృష్ణా, గోదావరి జలాల పునఃపంపిణీ జరగాలని ఏపీ రైతు సంఘం నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం ఆ సంఘం నాయకులు కలెక్టరేట్ వద్ద నిరసన తెలిపారు. సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మల్లికార్జున మాట్లాడుతూ ఏపీ విభజన చట్టం, గత ట్రిబ్యునల్ ఉత్తర్వులకు వ్యతిరేకంగా తెలంగాణలో నిర్మించిన, నిర్మిస్తున్న ప్రాజెక్టుల వల్ల ఏపీకి జరిగే నష్టాలను ట్రిబ్యునల్ దృష్టికి తీసుకెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. శ్రీశైలం దిగువన సాగర్ ఎడమ కాలువ నుంచి తెలంగాణకు 99 టీఎంసీలు, ఏపీకి 33 టీఎంసీల నీటిని వినియోగించుకోవాల్సి ఉన్నప్పటికీ మన రాష్ట్రానికి రావాల్సిన 33 టీఎంసీలు రాకపోవడం వల్ల 3, 4 జోన్లలో నీరు అందని దుర్భర పరిస్థితులు ఏర్పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. గోదావరి నీటి పంపిణీపై చర్చించేందుకు ఉభయ రాష్ట్రాల మధ్య ప్రత్యేక ట్రిబ్యునల్ ఏర్పాటుచేయాలని కోరారు. సీఎం చంద్రబాబు ప్రత్యేక చొరవ తీసుకుని పలు అంశాలపై చర్చించేందుకు అన్ని రాజకీయ పార్టీలు, రైతు సంఘాల నాయకులు, నీటి రంగ నిపుణులతో సమావేశం నిర్వహించాలని కోరారు. రైతు సంఘం ఉపాధ్యక్షుడు రామకృష్ణ, నారాయణస్వామి, చలపతి, రమేష్, నరేష్ పాల్గొన్నారు. అలాగే అమూల్ పాల రైతులకు న్యాయం చేయాలని ఆయన కోరారు. బాధిత రైతులు కలెక్టరేట్ వద్ద ఆందోళన చేపట్టారు. మల్లికార్జున మాట్లాడుతూ 10వ తేదీ నుంచి సంఘాల నుంచి అమూల్ పాల సేకరణను నిలుపుదల చేస్తున్నట్లు సంస్థ వారుచెప్పారన్నారు. మహిళా సంఘాలు రైతులకు ఎలాంటి ప్రత్యామ్నాయం చెప్పకుండా ఇలా చేయడం సరికాదన్నారు. కొర్రపాడు సర్పంచ్ శ్రీనివాసరెడ్డి నాగరాజు, ఆలమూరు మాధవి, శ్రీధర్‌రెడ్డి, శివలింగ పాల్గొన్నారు.

వేతనాల కోసం పారిశుధ్య కార్మికుల ఆందోళన



ఆస్పత్రి ఆవరణలో నినాదాలు చేస్తున్న ఏఐటీయూసీ నాయకులు, కార్మికులు

అనంతపురం టౌన్, ఆగస్టు 5: నాలుగు నెలలుగా వేతనాలు అందక అవస్థలు పడుతున్నాం.. వెంటనే జీతాలు చెల్లించి ఆదుకోవాలని జిల్లా సర్వజన ఆస్పత్రిలో పారిశుధ్య కార్మికులు ఆందోళన చేపట్టారు. ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు రాజేష్‌గౌడు, మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రకాష్ ఆధ్వర్యంలో ఆందోళన కొనసాగింది. ఆస్పత్రిలోకి వెళ్లే పాత ముఖద్వారం వద్ద బైఠాయించి నిరసన చేపట్టారు. నాయకులు ప్రకాష్, రాజేష్ గౌడు మాట్లాడుతూ పారిశుధ్య కార్మికుల పట్ల ఏజెన్సీ నిర్వాహకులు తీవ్ర నిర్లక్ష్యం చేస్తున్నారన్నారు. మూడేళ్లుగా ఏ సమస్యను పరిష్కరించలేదని ఆగ్రహించారు. జీఓ ప్రకారం వేతనాలు ఇవ్వాలని కోరుతున్నా పట్టించుకోకపోగా మళ్లీ నెలల తరబడి జీతాలు ఇవ్వకుండా మానసిక వేదనకు గురిచేస్తున్నారని ధ్వజమెత్తారు. వేతనానికి సరిపడా పీఎఫ్ కూడా జమచేయకుండా కార్మికుల శ్రమను దోపిడీ చేస్తున్నారని మండిపడ్డారు. అధికారులకు చెబుతున్నా పట్టించుకోక పోవడం దారుణమన్నారు. దీర్ఘకాలికంగా ఉన్న సమస్యలను పరిష్కరించాలని, లేనిపక్షంలో పెద్దఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. అనంతరం ఆర్ఎంఓ డాక్టర్ పద్మజను కలిసి వినతి పత్రం అందించారు. ఏఐటీయూసీ నగర అధ్యక్ష కార్యదర్శులు చిరంజీవి, కృష్ణుడు, మనోహర్, వెంకటేష్, కాంతమ్మ, రామాంజనేయులు, భార్గవి, మంజుల పాల్గొన్నారు.

సుప్రీం తీర్పును మాయావతి తప్పుబట్టడం తగదు

● ఎంఈఎఫ్ నాయకులు



మాట్లాడుతున్న శంకర్

అనంతపురం విద్య, ఆగస్టు 5: ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణపై సుప్రీంకోర్టు సమర్థిస్తూ... ఇచ్చిన తీర్పును బీఎస్పీ అధ్యక్షురాలు మాయవతి తప్పుపట్టడం తగదని మాదిగ ఉద్యోగుల సమాఖ్య (ఎంఈఎఫ్) నాయకులు ఖండించారు. సోమవారం ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు రమేష్‌తో కలసి కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. సంఘం జాతీయ అదనపు ప్రధాన కార్యదర్శి బండారు శంకర్ మాట్లాడుతూ ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ జరిగితే ఎస్సీలోని అన్ని ఉప కులాలకు జనాభా ప్రాతిపదికన సమాన వాటా దక్కుతుందనే సామాజిక న్యాయ సూత్రాన్ని మాయావతి విస్మరించరాదన్నారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 341 ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణకు అడ్డుగాలేదని సుప్రీం ఇచ్చిన తీర్పులో స్పష్టంగా ఉందని, దీన్ని ఆమె అర్థం చేసుకోవాలని సూచించారు. మందకృష్ణ మాదిగ 30 ఏళ్లుగా నడిపించిన ఉద్యమం వల్ల ప్రధాని మోదీ నాయకత్వంలో కేంద్ర ప్రభుత్వ సహకారంతో ఈ రోజు ఎస్సీ వర్గీకరణకు అనుకూలమైన తీర్పు వచ్చిందన్నారు. సమావేశంలో జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ బండారు నాగేంద్ర, కోశాధికారి పుల్లన్న, ఉపాధ్యక్షులు శ్రీనివాసులు, కార్యదర్శి ప్రసాద్, నగర ప్రధానకార్యదర్శి నారాయణస్వామి పాల్గొన్నారు.

పరిష్కార వేదికలో ఒకే ఒక్కడు..!



పరిష్కార వేదికకు తహసీల్దార్ మాత్రమే హాజరైన దృశ్యం

చెన్నేకొత్తపల్లి, ఆగస్టు 5: సమస్యల పరిష్కారం కోసం ప్రతివారం నిర్వహిస్తున్న ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదికకు అధికారులు డుమ్మాకొడుతున్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన కార్యక్రమానికి కేవలం తహసీల్దార్ హమీద్‌బాషా ఒక్కరే హాజరయ్యారు. మిగిలిన శాఖ అధికారులు గైర్హాజరయ్యారు. ఉదయం 11 గంటలు దాటిన ఏ ఒక్క అధికారి హాజరు కాలేదు. 18శాఖలకు సంబంధించిన అధికారులు హాజరు కావాల్సి ఉండగా తహసీల్దార్ ఒక్కరే కనిపించారు. ప్రతి సోమవారం మండలకేంద్రాల్లో అధికారులందరూ అందుబాటులో ఉండి ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను స్వీకరించి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాలున్నా ఇక్కడ అధికారులు బేఖాతరు చేస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. దీనిపై తహసీల్దార్‌ను వివరణ కోరగా పలు శాఖల అధికారులతో పాటు గ్రామ రెవెన్యూ అధికారులు కూడా హాజరు కాలేదని దీనిపై జిల్లా అధికారులకు నివేదిక పంపుతామన్నారు.

అర్హులందరికీ రేషన్



లబ్ధిదారులకు రేషన్ పంపిణీ చేస్తున్న ధర్మవరపు మురళి

రాప్తాడు, ఆగస్టు 5: అర్హులైన పేద ప్రజలందరికీ రేషన్ అందేలా ఎమ్మెల్యే పరిటాల సునీత చర్యలు చేపట్టారని టీడీపీ మండల ఇన్‌చార్జి ధర్మవరపు మురళి అన్నారు. మండలంలోని బొమ్మేపర్తి, లింగనపల్లి గ్రామాల్లో సోమవారం డీలర్లు రేషన్ పంపిణీ ప్రారంభించారు. మురళి మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం 10 ఎకరాల భూమి ఉన్న రైతులకు రేషన్ కార్డులు తొలగించిందన్నారు. భూమి నిబంధన లేకుండా అందరికీ రేషన్ కార్డులు మంజూరు చేయించి రేషన్ అందించాలని పరిటాల సునీత ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లనున్నట్లు తెలిపారు. కన్వీనర్ కొండప్ప, బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి నారాయణస్వా మి, కురుబ సాధికార సమితి రాష్ట్ర కన్వీనర్ గంగలకుంట రమణ, మరూరు గోపాల్, సర్పంచులు తిరుపాలు, శీనయ్య, ఎంపీటీసీ జాఫర్, డీలర్ విశ్వనాథ్‌రె డ్డి, రాజశేఖర్‌రెడ్డి, తిరుపతిరెడ్డి, శ్రీనివాసులు, పుల్లలరేవు గోపాల్ పాల్గొన్నారు.

నీటి వనరులను సంరక్షించుకోవాలి



పూడికతీత పనులు ప్రారంభిస్తున్న దృశ్యం

చెన్నేకొత్తపల్లి, ఆగస్టు 5: నీటి వనరులను సంరక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని రాయలసీమ వాటర్ ప్రాజెక్టు మేనేజర్ శ్రీకాంత్, ప్రాజెక్టు కో-ఆర్డినేటర్ రవి అన్నారు. టింబక్టు కలెక్టివ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో మండలంలోని గువ్వలగోవిందంపల్లి గ్రామంలో చెక్‌డ్యాంలు, గొందిచెలిమి మరమ్మతులలో భాగంగా పూడిక తీ పనులను సోమవారం ప్రారంభించారు. వారు మాట్లాడుతూ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో రొద్దం, రామగిరి, చెన్నేకొత్తపల్లి మండలాల్లోని 16 గ్రామాలలో రాయలసీమ వాటర్ ప్రాజెక్టు కార్యక్రమం ద్వారా ఉమ్మడి భూములు, నీటి సంరక్షణ కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. కల్పవల్లి సొసైటీ అధ్యక్షుడు వెంకటరమణప్ప, కార్యకర్తలు నారాయణస్వామి, ముత్యాలయ్య, కమ్యూనిటీ రీసోర్స్ పర్సన్స్ రైతులు పాల్గొన్నారు.

బీటీపీ ద్వారా అన్ని చెరువులకు నీరందిస్తాం

● రెండున్నరేళ్లలో ఆ ప్రక్రియ పూర్తి చేస్తాం

● ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు

కళ్యాణదుర్గం, ఆగస్టు 5: వచ్చే రెండున్నరేళ్లలో నియోజకవర్గంలోని అన్ని చెరువులకు బీటీపీ ద్వారా నీరందిస్తామని ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు పేర్కొన్నారు. ఎమ్మెల్యే జన్మదిన వేడుకలు పట్టణంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తెలుగు ఆయన తన స్వగృహంలో వేద పండితుల చేత ఆశీర్వాదాలు పొందారు. తర్వాత స్థానిక వాల్మీకి సర్కిల్, టీ సర్కిల్‌లో టీడీపీ నాయకులు ఏర్పాటు చేసిన భారీ కేకులను కట్ చేశారు. అలాగే పార్టీ శ్రేణులతో కలిసి టీ సర్కిల్ నుంచి నగర వనం వరకు గ్రీన్ ర్యాలీ నిర్వహించారు. నగర వనంలో విద్యార్థులు, అటవీ సిబ్బంది, నాయకులతో కలిసి మొక్కలు నాటారు. తర్వాత మార్కెట్ యార్డులో అభయ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు బాలరంగ్ ఆధ్వర్యంలో టైలరింగ్, డ్రైవింగ్ ఉచిత శిక్షణ కేంద్రాలను ప్రారంభించారు. తన మొదటి నెల జీతాన్ని అభయ ఫౌండేషన్‌కు విరాళంగా అందిస్తున్నట్లు ప్రకటించారు. అలాగే ప్రజావేదిక వద్ద వందలాది అభిమానుల మధ్య కేక్ కట్ చేశారు. ప్రజావేదిక వద్ద మెగారక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. 1500 మందికి పైగా రక్తదానం చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ వచ్చే రెండున్నరేళ్లలో సీఎం చంద్రబాబు సహకారంతో భైరవాని తిప్ప ప్రాజెక్టు (బీటీపీ) ద్వారా నియోజకవర్గంలోని 114 చెరువులకు నీరు అందిస్తామని తెలిపారు. అదేవిధంగా అన్ని గ్రామాలకు తారు రోడ్లు వేస్తామన్నారు. కళ్యాణదుర్గం నియోజకవర్గాన్ని అందరి సహకారంతో అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. గత వైసీపీ ప్రభుత్వంలో పాలకులు దోచుకోవడమే తప్ప అభివృద్ధి పనులు చేయలేదని ఈ సందర్భంగా విమర్శించారు. సమావేశం అనంతరం పెద్ద ఎత్తున అన్నదానం జరిగింది. కార్యక్రమంలో ఎమ్మెల్యే అల్లుడు అవినాష్, ఆయా గ్రామాల టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



ప్రజావేదిక వద్ద కేకును కట్ చేస్తున్న ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు

హనుమాన్ దర్శనానికి ప్రత్యేక బస్సులు

గుంతకల్లుటౌన్, ఆగస్టు 5: శ్రావణమాసాన్ని పురస్కరించుకుని హనుమాన్ దర్శనం కోసం గుంతకల్లు ఆర్టీసీ డిపో నుంచి ప్రత్యేక బస్సు సర్వీసులను నడుపనున్నట్లు డిపో మేనేజర్ బాలాజీ బుధవారం సోమవారం ప్రకటనలో తెలిపారు. ఈ నెల 6, 10, 13, 17, 20, 24, 27, 31వ తేదీల్లో కసాపురం, మురడి, నేమకల్లు ఆంజనేయస్వామి ఆలయాలను దర్శించుకునే భక్తుల కోసం బస్సులను నడపనున్నట్లు చెప్పారు. ఒకే రోజున ఆయా ఆలయాలను దర్శించుకునేందుకు రాను, పోను చార్జీలు పెద్దలకు రూ. 480లు, పిల్లలకు రూ.230లు నిర్ణయించామన్నారు. ముందస్తు రిజర్వేషన్ సౌకర్యం కల్పించినట్లు పేర్కొన్నారు.

చర్యలు తీసుకోవాలని వినతి

గుంతకల్లుటౌన్, ఆగస్టు 5: వాహనదారులను పెట్రోల్, డీజిల్‌లో మోసం చేస్తున్న పెట్రోల్ బంక్ యజమానులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ సీపీఎంఎల్ న్యూడెమోక్రసీ పార్టీ నాయకులు సోమవారం పట్టణంలో ఆర్డీఓ శ్రీనివాసులు రెడ్డికి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆ పార్టీ గుంతకల్లు డివిజన్ కార్యదర్శి సురేష్ మాట్లాడుతూ పట్టణంలోని చాలా పెట్రోల్ బంకుల్లో లీటర్ పెట్రోల్, డీజిల్‌కు పది పాయింట్లను తక్కువగా వేస్తున్నారన్నారు. అలాగే పది లీటర్లకు తొమ్మిది లీటర్లు వేసి మోసం చేస్తున్నారని తెలిపారు. మోసాలకు పాల్పడుతున్న పెట్రోల్ బంక్ యజమానులపై చర్యలు తీసుకోవాలని కోరారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో సభ్యులు రమనాథ్‌రెడ్డి, జిలాన్, బాషా, గోపి, విశ్వనాథ్, రామదాస్, ఆటోగోపి, భరత్ పాల్గొన్నారు.

డీజీహెచ్‌ఎస్ కమిటీ ఎన్నిక

ఉరవకొండ, ఆగస్టు 5: దళిత గిరిజన హక్కుల సాధన సమితి (డీజీహెచ్‌ఎస్) నియోజకవర్గ కమిటీని పట్టణంలో సోమవారం ఎన్నిక చేశారు. గౌరవాధ్యక్షుడిగా గంగాధర్, అధ్యక్షుడిగా పి. కుమార్, ఉపాధ్యక్షుడిగా సురేష్, ప్రధానకార్యదర్శిగా కిరణ్, కార్యదర్శిగా శ్రీకాంత్, సహాయకార్యదర్శిగా నరసింహులు, కోశాధికారిగా ప్రభాకర్, ఆధికార ప్రతినిధిగా నాగరాజులతో పాటు మరో ఇద్దరిని కార్యవర్గ సభ్యులుగా ఎన్నికయ్యారు.

హెచ్ఎంల సమావేశం

కూడేరు, ఆగస్టు 5: మండలకేంద్రంలోని ఎమ్మార్సీలో సోమవారం ఎంఈఓలు చంద్రశేఖర్, సాయిలక్ష్మి మండలంలోని పాఠశాలల హెచ్‌ఎంలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ నెల 8వ తేదీన జరిగే స్కూల్ కమిటీ ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించాలని సూచించారు.

ఐటీఐలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

తాడిపత్రి, ఆగస్టు 5: పట్టణంలోని ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో ప్రవేశాల కోసం ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ మంజేనాథ సోమవారం ప్రకటనలో తెలిపారు. కళాశాలలో కోపా, మెకానిక్ డీజిల్, ఫిట్టర్, ఎలక్ట్రీషియన్, డ్రాఫ్ట్‌మెన్ సివిల్ కోర్సులు అందుబాటులో ఉన్నాయన్నారు. ఈనెల 26వరకు దరఖాస్తు చేసుకోవచ్చునన్నారు. 27న సర్టిఫికెట్ వెరిఫికేషన్ చేయించుకోవాలన్నారు. 29న ఇంటర్వ్యూలు నిర్వహిస్తామన్నారు. వెరిఫికేషన్ చేయించుకున్న అభ్యర్థులకు మాత్రమే కౌన్సిలింగ్ ఉంటుందన్నారు. కౌన్సిలింగ్‌కు సంబంధించి అభ్యర్థులకు ఎలాంటి కాల్‌లెటర్స్ పంపబడవని నేరుగా హాజరుకావాలని సూచించారు.

ఉచిత విద్యుత్ కోసం..

యాడికి, ఆగస్టు 5: చేనేతలకు ప్రభుత్వం ఇస్తున్న వందయూనిట్ల ఉచిత విద్యుత్ లబ్ధిపొందడానికి అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని బ్రాంచ్ ఏఈ రాజారావు సోమవారం ప్రకటనలో తెలిపారు. అర్హులైన చేనేతలు దరఖాస్తుకు ఆధార్‌కార్డు, చేనేత గుర్తింపుకార్డు, మగ్గం నేస్తున్న ఫొటో, కరెంట్‌బిల్లు జతచేసి కార్యాలయంలో అందించాలని సూచించారు.

ఐదుగురి బైండోవర్

యల్లనూరు, ఆగస్టు 5: మండలకేంద్రంలోని పోలీస్ స్టేషన్ వద్ద నాలుగురోజులక్రితం జరిగిన దాడుల కేసులో ఐదుగురిని బైండోవర్ చేసినట్లు ఎస్ఐ సంపత్ తెలిపారు. కటిక మునిరెడ్డితో పాటు మరో నలుగురిని తహసీల్దార్ ఎదుట హాజరుపరిచి బైండోవర్ చేశామని ఆయన చెప్పారు.

ఇద్దరు దొంగల అరెస్టు

తాడిపత్రి, ఆగస్టు 5: మండలంలోని కావేరీసముద్రంలో ఇద్దరు దొంగలను అరెస్ట్ చేశామని రూరల్ పోలీసులు తెలిపారు. ఆ గ్రామంలో సోమవారం ఏఎస్ఐకు చెందిన చోటుకుమార్, అనిల్ బంగారు గొలుసులను మెరుగుపెడతామంటూ తిరిగారు. స్థానిక రమణారెడ్డి కుటుంబ సభ్యులు గొలుసును మెరుగుపరిచేందుకు వారికి ఇచ్చారు. మెరుగుపట్టిన తర్వాత గొలుసును పరిశీలించడంతో తూకంలో చాలా తేడా ఉండని గమనించారు. అనుమానం వచ్చి పోలీసులకు సమాచారం అందించారు. దీంతో వెంటనే తాము గ్రామానికి వెళ్లి ఆ ఇద్దరిని స్టేషన్‌కు తరలించామని, బాధితుల ఫిర్యాదుమేరకు అరెస్టుచేసి రిమాండ్‌కు పంపామని పోలీసులు తెలిపారు.

వేర్వేరు కేసుల్లో నలుగురి అరెస్టు

తాడిపత్రి, ఆగస్టు 5: పట్టణంలో సోమవారం వేర్వేరు కేసుల్లో నలుగురిని అరెస్ట్ చేశామని పోలీసులు తెలిపారు. ఆదివారం రాత్రి స్థానిక చిన్నబజారులో ఉన్న తెలుగుయువత పట్టణ అధ్యక్షుడు బిక్కెపల్లి ఖాదర్‌బాషా ఇంటివద్దకు వైసీపీ మద్దతుదారు గండికోట చిన్ ఫాలియాస్ ఆఫ్రుఫ్, షేక్ గౌసెమొద్దీన్ అలియాస్ గౌస్ వెళ్లి కుటుంబ సభ్యులను బెదిరించారు. ఆ సమయంలో ఖాదర్‌బాషా లేకపోవడంతో గట్టిగా కేకలు వేస్తూ.. దాడిచేస్తామని గుర్తుపెట్టుకోవాలని హెచ్చరించారు. ఈ మేరకు ఖాదర్‌బాషా భార్య చాందిని ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశామన్నారు. దీంతో సోమవారం అర్ఫరోఫ్, గౌస్‌లను అరెస్టుచేసి రిమాండ్‌కు పంపామన్నారు. అలాగే నాలుగురోజులక్రితం మెయిన్‌బజారుకు చెందిన అల్లాబకాష్‌పై షేక్ ఖాజా అలియాస్ కాలు, జావర్ అలియాస్ యబ్బజావర్‌లు మద్యం మత్తులో దాడిచేశారు. దీంతో బాధితుని ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి సోమవారం ఆ ఇరువురిని అరెస్టుచేసి రిమాండ్‌కు పంపామని పోలీసులు తెలిపారు.

హాస్టల్‌ను ఏర్పాటు చేయాలని వినతి

గుత్తి, ఆగస్టు 5: పట్టణంలో ఎస్సీ బాలికల కళాశాల విద్యార్థుల సౌకర్యార్థం హాస్టల్‌ను ఏర్పాటు చేయాలని స్థానిక ఎస్ఎఫ్ఐ నాయకులు ఎస్సీ వెల్ఫేర్ గుత్తి డివిజన్ అధికారి రాధికకు సోమవారం వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు రమేష్, నాయకులు రవీంద్ర, నవీన్, బాలు పాల్గొన్నారు.

దివ్యాంగుడి ఆత్మహత్య

గుత్తిరూరల్, ఆగస్టు 5: మండలంలోని తురకపల్లి గ్రామానికి చెందిన దివ్యాంగుడు రాము (45) ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. రాము చిల్లర కొట్టు పెట్టుకుని జీవనం సాగిస్తుండేవాడు. గత కొద్ది రోజుల క్రితం కాళ్లకు ఆపరేషన్ చేయించుకున్నాడు. ఆయితే కాళ్లు మరింత నష్టపడి పోయాయి. ఇందుకు మనస్తాపం చెందిన ఆ తను సోమవారం సాయంత్రం ఒకరి మీద ఆధారపడి బతకకూడదని లెటర్ రాసి ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకున్నాడు. కొద్దిసేపటికి కుటుంబ సభ్యులు గుడి నుంచి చూడగా అప్పటికే మృతి చెందాడు. మృతుడికి భార్య ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

తహసీల్దార్ల బాధ్యతల స్వీకరణ

ఆంధ్రజ్యోతి, న్యూస్‌నెట్‌వర్క్: గుంతకల్లు, ఉరవకొండ, శింగనమల, తాడిపత్రి, కళ్యాణదుర్గం, రాయదుర్గం నియోజకవర్గాల్లోని పలు మండలాల్లో నూతన తహసీల్దార్లు సోమవారం బాధ్యతలు చేపట్టారు. మండలకేంద్రాల్లోని తహసీల్దార్ కార్యాలయాల్లో వారు బాధ్యతలు స్వీకరించారు. గుంతకల్లు తహసీల్దార్‌గా ఎస్ రమాదేవి, గుత్తి తహసీల్దార్‌గా హెచ్. ఓబులేసు బాధ్యతలు స్వీకరించారు. ఇక ఉరవకొండ తహసీల్దార్‌గా ఎస్.మహబూబ్‌బాషా, వజ్రకరూరు తహసీల్దార్‌గా నయాజ్ అహ్మద్, విడపనకల్లు తహసీల్దార్‌గా సునీతాబాయి బాధ్యతలు చేపట్టారు. అలాగే శెట్టూరు మండల తహసీల్దార్‌గా ఈశ్వరయ్యశెట్టి, బొమ్మనహాళ్ తహసీల్దార్‌గా మునివేలు, కణేకల్లు తహసీల్దార్‌గా వరకుమార్, డీహీరేహాళ్ తహసీల్దార్‌గా అనిల్‌కుమార్ బాధ్యతలు చేపట్టారు. అదేవిధంగా పుట్లూరు తహసీల్దార్‌గా శేషారెడ్డి, యల్లనూరు తహసీల్దార్‌గా నాగరాజు, పెద్దపప్పూరు తహసీల్దార్‌గా బాలాజీరావు బాధ్యతలు స్వీకరించారు.

పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలి

పెద్దవడుగూరు, ఆగస్టు 5: ఉపాధిహామీ పథకానికి సంబంధించి పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలని కోరుతూ మండలకేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద సోమవారం సీపీఐ నాయకులు ధర్నా నిర్వహించారు. సీపీఐ మండల కార్యదర్శి వెంకటరామయాదవ్, సీనియర్ నాయకుడు నారాయణ మాట్లాడుతూ మండలవ్యాప్తంగా ఉపాధికూలీలు చేసిన పనులకు 10వారాల నుంచి బిల్లులు రాలేదన్నారు. దీంతో వారు జీవనానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. అధికారులు వెంటనే ఖాతాల్లో డబ్బులను జమచేయాలన్నారు. ధర్నాలో మండల సహాయ కార్యదర్శి పోలా రంగస్వామి, ఏఐటీయూసీ మండల అధ్యక్షుడు హుస్సేన్ పీరా, సీపీఐ నాయకులు ఉపాధికూలీలు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలను పరిష్కరించాలని ధర్నా

కళ్యాణదుర్గం, ఆగస్టు 5: కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో సోమవారం పట్టణంలో నిరసన ర్యాలీ జరిగింది. స్థానిక వర్క్షాప్ తెలగియ్యల ఆఫీస్ నుంచి, తెలగించిన వారి విధుల్లోకి తీసుకోవాలని కోరుతూ ఆందోళన చేపట్టారు. పట్టణంలోని ఆర్డీఓ బస్టాండ్ నుంచి ఆర్డీఓ కార్యాలయం వరకు అంగన్వాడీలు, మున్సిపల్ కార్మికులు, సివిల్ సప్లై హమాలీలు, ఆశా కార్యకర్తలు, శ్రీరామిరెడ్డి, సత్యసాయి వాటర్ కార్మికులు, పారిశుధ్య కార్మికులు, ఫీల్డ్ అసిస్టెంట్లు పెద్ద ఎత్తున ర్యాలీ చేపట్టారు. అనంతరం ఆర్డీఓ కార్యాలయం వద్ద బైఠాయించి నినాదాలు చేశారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షురాలు నాగమణి, అంగన్‌వాడీ యూనియన్ జిల్లా కార్యదర్శి రమాదేవి, సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి అచ్యుత్ ప్రసాద్ మాట్లాడుతూ అన్ని మండలాల్లో స్కీం వర్కర్లను తొలగించారని, ప్రధానంగా మధ్యాహ్న భోజన పథకంలో పనిచేస్తున్న కార్మికులందరినీ తొలగించడం దారుణమని అన్నారు. తొలగించిన వారిని వెంటనే విధుల్లోకి చేర్చుకోవాలన్నారు. లేనిపక్షంలో పెద్దఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. అనంతరం ఆర్డీఓ రాణిసుస్మితకు వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో కార్మికులు, సీఐటీయూ నాయకులు పాల్గొన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

గుంతకల్లుటౌన్, ఆగస్టు5: పట్టణంలోని బీమిరెడ్డి కాలనీ సమీపంలో పేకాట ఆడుతున్న ఆరుగురిని సోమవారం సాయంత్రం అరెస్టు చేసినట్లు రూరల్ ఎస్ఐ సురేష్ తెలిపారు. పేకాట ఆడుతున్నారని సమాచారం అందడంతో వెంటనే దాడులు చేశామని, పేకాటరాయుళ్లను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.12,500లు స్వాధీనం చేసుకున్నామని ఎస్ఐ చెప్పారు.

విద్యార్థులకు నోటు పుస్తకాల పంపిణీ

కళ్యాణదుర్గం/ బ్రహ్మసముద్రం/ కుందుర్పి, ఆగస్టు 5: ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు జన్మదినం సందర్భంగా కంబదూరులోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు సోమవారం నోటు పుస్తకాలు పంపిణీ చేశారు. సుమారు 50 మంది విద్యార్థులకు ఆసుపత్రి అభివృద్ధి కమిటీ మాజీ చైర్మన్ లింగా సురేంద్ర వాటిని అందజేశారు. ఎంఈఓ మనోహరన్, హెచ్ఎం జిలాన్‌బాషా, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. అలాగే బ్రహ్మసముద్రం మండలం పాలవెంకటాపురం గ్రామ విద్యార్థులకు టీడీపీ మండల కన్వీనర్ పాలాక్ష్మి శ్రీరాములు రూ. 20 వేల విలువ చేసే నోటు పుస్తకాలు, పెన్నులను పంపిణీ చేశారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. అదేవిధంగా కుందుర్పి మండలంలోని బెస్తరపల్లిలో టీడీపీ నాయకులు 50 మంది అంగన్‌వాడీ విద్యార్థులకు ప్లేట్లు, గ్లాసులు పంపిణీ చేశారు.



కంబదూరులో నోటు పుస్తకాలు అందజేస్తున్న లింగా సురేంద్ర

మొవ్వకుళ్లు తెగులు నుంచి పంటను కాపాడాలి

రాయదుర్గం రూరల్, ఆగస్టు 5: మొవ్వకుళ్లు తెగులు నుంచి వేరుశనగ పంటను కాపాడుకోవాలని వ్యవసాయశాఖ ఏడీఏ లక్ష్మానాయక్ రైతులకు సూచించారు. మండలంలోని ఆరేపేంటి గ్రామంలో ఖరీఫ్‌లో సాగుచేసిన వేరుశనగ పంటను సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడుతూ మండలంలో వేరుశనగ పంటకు మొవ్వకుళ్లు తెగులు అధికంగా ఉందని, నివారణకు ఇమిడక్లోప్రిడ్ మందును పిచికారి చేయాలని సూచించారు. నియోజకవర్గంలో పంట నమోదు కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రతి రైతు ఈ పంట నమోదు చేయించుకోవాలని చెప్పారు. ఏఓ మహేంద్ర పాల్గొన్నారు.

దళారీపై చర్యలు తీసుకోండి

కణేకల్లు, ఆగస్టు 5: తమ నుంచి పప్పుశనగ కొనుగోలు చేసి డబ్బులు ఇవ్వకుండా మోసం చేసిన వైసీపీ దళారీపై చర్యలు తీసుకోవాలని నిలజగల్లుకు చెందిన రైతులు ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులుకు వినతిపత్రం అందించారు. రైతులు వీరప్ప, చంద్ర, గోపాల్, ఆదినారాయణ, జ్ఞానేశ్వర్‌తో పాటు పలువురు రైతులు సోమవారం ఎమ్మెల్యేను కలిసి తమ గోడును వెళ్లబోసుకున్నారు. మాల్యాలకు చెందిన వైసీపీ నాయకుడు, దళారీ తిప్పారెడ్డి తమ గ్రామంలోని అనేకమంది రైతుల నుంచి లక్షలాది రూపాయల విలువైన పప్పుశనగ కొనుగోలు చేశాడని, అనంతరం డబ్బులు ఇవ్వకుండా ఎగ్గొట్టాడని వాపోయారు. గతంలో ఈయనపై పోలీసులకు ఫిర్యాదు చేస్తే అధికార పార్టీ నాయకుడన్న కారణంతో ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. మీరైనా చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత

రాయదుర్గంరూరల్, ఆగస్టు 5: మండలంలోని మెచ్చిరి గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు ఆదికేశవులు ఇటీవల దారుణ హత్యకు గురికావడంతో ఆయన కుటుంబానికి ప్రభుత్వం సీఎం రిలీఫ్‌ఫండ్ కింద రూ. రెండు లక్షలు మంజూరు చేసింది. ఇందుకు సంబంధించిన చెక్కును ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు పట్టణంలోని తన నివాసంలో సోమవారం మృతుడి భార్య పార్వతమ్మకు అందజేశారు.

టీడీపీ కార్యకర్తపై దాడి

తాడిపత్రి, ఆగస్టు5: మండలంలోని ఆర్టీసీ కాలనీ సమీపంలో ఆదివారం రాత్రి పుట్లూరు మండలం కోమటికుంట్ల గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త తాజ్‌పై గుర్తుతెలియని వ్యక్తులు దాడిచేసినట్లు గాయపరిచారు. దీనిపై ఎలాంటి ఫిర్యాదు రాలేదని రూరల్ పోలీసులు తెలిపారు.

పాముకాటుతో వ్యక్తి మృతి

కళ్యాణదుర్గం రూరల్, ఆగస్టు5: మండలంలోని కావల్లపల్లికి చెందిన అనిల్ (30) పాముకాటుతో మృతి చెందాడు. అనిల్ ఆదివారం రాత్రి ఇంటి ఆరుబయట నిద్రించాడు. భార్య గాయత్రి, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఇంటిలో నిద్రించారు. అయితే అర్ధరాత్రి సమయంలో ఏదో కరిచినట్లు అనిపించడంతో అనిల్ లేచి పరిశీలించాడు. దుప్పట్లో పాము ఉన్నట్లు గుర్తించి భార్యకు, స్థానికులకు తెలిపాడు. వారు వెంటనే అతన్ని కళ్యాణదుర్గం ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. కళ్యాణదుర్గం రూరల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కురుబ సంఘం నియోజకవర్గ కమిటీ ఎన్నిక

కళ్యాణదుర్గం, ఆగస్టు 5: కురుబ సంఘం కళ్యాణదుర్గం నియోజకవర్గ కమిటీని సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పట్టణంలోని భక్త కనకదాసు కల్యాణ మండపంలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బోరంపల్లి ఆంజనేయులు ఆధ్వర్యంలో ఈ ఎన్నిక జరిగింది. నియోజకవర్గ అధ్యక్షుడిగా రామక్కపల్లి నాగరాజు, కళ్యాణదుర్గం పట్టణ అధ్యక్షుడిగా రామక్కపల్లి, కుందుర్పి మండల అధ్యక్షుడిగా రామక్కపల్లి, కుందుర్పి మండల అధ్యక్షుడిగా రమేష్, శెట్టూరు మండల అధ్యక్షుడిగా నాగరాజు, కళ్యాణదుర్గం రూరల్ మండల అధ్యక్షుడిగా పరశురామ్, బ్రహ్మసముద్రం మండల అధ్యక్షుడిగా నాగరాజును ఎన్నుకున్నారు.

గ్రామాల అభివృద్ధే లక్ష్యం : ఎమ్మెల్యే

పెద్దవడుగూరు, ఆగస్టు 5: గ్రామాల అభివృద్ధే తమ లక్ష్యమని ఎమ్మెల్యే జేసీ అస్మిత్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని కాశేపల్లి, గుత్తిఅనంతపురం గ్రామాల్లో సోమవారం ఆయన పర్యటించారు. కాశేపల్లిలో తాగునీటి సమస్య ఉండడంతోపాటు డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామని గ్రామస్థులు ఆయన దృష్టికి తీసుకొచ్చారు. గుత్తిఅనంతపురం ప్రధాన రహదారి శిథిలావస్థకు చేరుకోవడంతో డ్రైనేజీ నీరు రహదారిపై ప్రవహిస్తూ దుర్గంధం వెదజల్లుతోందని విన్నవించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ సమస్యలన్నీ ఒక్కొక్కటిగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. మిడుతూరు గ్రామం వద్ద నార్త్ కెనాల్‌లో వివిధగా పిచ్చిమొక్కలు పెరగడంతో రైతులకు సాగునీటికి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వెంటనే వాటిని తొలగించాలని అధికారులను ఆదేశించారు. గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా పని చేస్తామని పేర్కొన్నారు. ఆయన వెంట టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు కేశవరెడ్డి, మండల కన్వీనర్ కొండూరు కేశవరెడ్డి, ఎంపీటీసీ మెంబరు చిన్నగోవిందు, కార్యకర్తలు ఉన్నారు.



కాశేపల్లిలో సమస్యలను వింటున్న ఎమ్మెల్యే జేసీ అస్మిత్ రెడ్డి

పట్టణంలో పర్యటన

తాడిపత్రి: పట్టణంలో ఎమ్మెల్యే జేసీ అస్మిత్‌రెడ్డి పర్యటించారు. సీబీరోడ్డు, గాంధీసర్కిల్, యల్లనూరురోడ్డు, మెయిన్‌బజారు, పోలీస్‌స్టేషన్‌రోడ్డులో పర్యటించి దుకాణాదారులను, చిరువ్యాపారులను ఆప్యాయంగా పలకరిస్తూ యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. వ్యాపారం ఎలా జరుగుతోందంటూ ఆరాతీశారు. అనంతరం పోలీస్‌స్టేషన్ సమీపంలో ఉన్న టీ స్టాల్ వద్ద ప్రజలతో కలిసి టీ తాగారు. ఆయన వెంట నాయకులు హరినాథ్‌రెడ్డి, జగన్నాథరెడ్డి, సుధీర్‌రెడ్డి, సుదర్శన్, ప్రసాద్, రామ్‌మోహన్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

డెంగీనివారణపై అవగాహన ర్యాలీ

రాయదుర్గంరూరల్, ఆగస్టు 5: మండలంలోని ఆవులదట్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలోని జుంజురంపల్లి గ్రామంలో సోమవారం జిల్లా మలేరియా సబ్ యూనిట్ అధికారి నాగేంద్రప్రసాద్ పర్యటించారు. ఈ సందర్భంగా సిబ్బంది, స్థానిక పాఠశాల విద్యార్థులతో కలిసి డెంగీనివారణపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దోమకాటు చాలా ప్రమాదకరమన్నారు. దీని ద్వారా డెంగీ తదితర విషజ్వరాలు వస్తాయన్నారు. కనుక దోమల నివారణకు చర్యలు తీసుకోవాలని గ్రామస్థులకు సూచించారు. ప్రతి శుక్రవారం డ్రైడే పాటించాలని తెలిపారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ నరసింహ, ఉపాధ్యాయులు ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

బుగ్గరామలింగేశ్వరుడికి ప్రత్యేక పూజలు

తాడిపత్రి, ఆగస్టు5: పట్టణంలోని బుగ్గరామలింగేశ్వరస్వామి ఆలయంలో శ్రావణమాసం మొదటి సోమవారాన్ని పురస్కరించుకుని ప్రత్యేక పూజలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు ఉదయమే స్వామివారికి పలు అభిషేకాలు, అలంకరణలు చేసి పూజలు జరిపారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామి, అమ్మవార్లను దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.



విశేష అలంకరణలో బుగ్గరామలింగేశ్వరుడు

చిక్కణ్ణేశ్వరాలయంలో విశేష పూజలు

కణేకల్లు: శ్రావణమాసాన్ని పురస్కరించుకుని మండల కేంద్రంలోని చిక్కణ్ణేశ్వర ఆలయంలో విశేష పూజలు జరిపారు. ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు హాజరై స్వామివారిని దర్శించుకున్నారు. సాయంత్రం స్వామి ఉత్సవ విగ్రహాన్నిశేష పల్లకిసేవ నడుమ పల్లకిలో ఊరేగించారు.

మంజునాథస్వామి ఆరాధనోత్సవం

బెళుగుప్ప: మండల కేంద్రంలోని మంజునాథస్వామి ఆలయంలో స్వామివారి 50 వ ఆరాధనా మహోత్సవాలను ఘనంగా నిర్వహించారు. వేదపఠనముచే అర్చకులు స్వామి మూలవిరాట్‌కు అభిషేకాలు, అలంకరణలు, పూజలు చేశారు. సాయంత్రం రథోత్సవం జరిపారు. భక్తులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

గడ్డివామి దగ్ధం

యల్లనూరు, ఆగస్టు 5: మండలంలోని గొడ్డుమర్రికి చెందిన టీడీపీ పార్లమెంటరీ బీసీ సెల్ అధికార ప్రతినిధి శివకు చెందిన గడ్డివామికి సోమవారం మధ్యాహ్నం గుర్తుతెలియని వ్యక్తులు నిప్పుపెట్టారు. సుమారు 12.30గంటల సమయంలో మంటలు పూర్తిగా వ్యాపించడంతో చుట్టుపక్కల వారు శివకు సమాచారం అందించారు. అప్పటికే మంటలు పూర్తిగా వ్యాపించాయి. వెంటనే తాడిపత్రి ఫైర్ స్టేషన్‌కు సమాచారం అందించారు. ఫైరింజన్ వచ్చే లోగా గడ్డివామి పూర్తిగా దగ్ధమైంది. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి విచారించారు. పశువుల మేత కోసం మండలకేంద్రం నుంచి సుమారు ఆరుట్రాక్టర్ల వరిగడ్డిని తీసుకొచ్చి నిల్వ చేసుకున్నామని బాధితుడు తెలిపారు. ఈ సంఘటనలో సుమారు రూ.2లక్షల మేర నష్టం వాటిల్లిందని ఆయన వాపోయారు.

బాలింతపై వైసీపీ నాయకుడి దాడి

గుమ్మఘట్ట, ఆగస్టు 5: వైసీపీ నాయకుల ఆగడాలు ఆగడం లేదు. ఓటమిని జీర్ణించుకోలేక టీడీపీ శ్రేణులపై దాడులకు పాల్పడుతూనే ఉన్నారు. ఈ క్రమంలో ఏకంగా బాలింతపైనే దాడి చేసి తీవ్రంగా గాయపరచిన ఘటన మండలంలో వెలుగుచూసింది. ఆదివారం రాత్రి పోలీసుల కథనం మేరకు.. బీటీపీలో బాలింత ఉన్న చంద్రకళ తన సోదరుడైన ఐటీడీపీ నాయకుడు రవిచంద్ర ఇంట్లో ఉంటోంది. కాగా అదే గ్రామానికి చెందిన వైసీపీ ఎస్సీసెల్ నాయకుడు గోవిందు అటువైపు వెళుతూ రవిచంద్రతో స్థలం విషయంలో గొడవకు దిగాడు. గొడవ కాస్తా పెద్దదిగా మారింది. ఈ క్రమంలో రవిచంద్రపై దాడి చేసేందుకు యత్నించగా.. అడ్డుకోవడానికి చంద్రకళ జోక్యం చేసుకుంది. దీంతో ఆమెను ఏ మాత్రం జాలి చూపకుండా ఆమెను దుర్భాషలాడుతూ రాళ్లు, కర్రలతో దాడికి పాల్పడ్డారు. దీంతో తలకు, చేతులకు తీవ్ర గాయాలయ్యాయి. కుటుంబసభ్యులు వెంటనే రాయదుర్గం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఫిర్యాదు అందడంతో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపారు.



చికిత్స పొందుతున్న చంద్రకళ

విధుల పట్ల విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం

- గత శనివారం విడపనకల్లులోని గడేకల్లు ఫీడర్‌కి ఎల్‌సీ తీసుకుని వజ్రకరూరులోని చాబాల ఫీడర్ కింద పనుల నిర్వహణ
- విషయం తెలియక వైర్లు మార్చేందుకు వెళ్లి ఓ వ్యక్తి మృత్యువాత
- శనివారం నాటిన స్తంభాలను ఆదివారం రాత్రికే తొలగింపజేసిన అధికారులు
- ఎందుకు తొలగించారో చెప్పలేకపోతున్న రైతులు


విడపనకల్లు, ఆగస్టు 5: మండలంలోని గడేకల్లు గ్రామంలో గత శనివారం సాయంత్రం విద్యుత్‌షాక్‌తో ఓ వ్యక్తి మరణించడానికి అధికారుల అవినీతి, నిర్లక్ష్యం, అక్రమంగా చేపట్టిన పనులే కారణమని స్పష్టమవుతోంది. గడేకల్లు గ్రామానికి చెందిన కొంత మంది రైతులు గత ఏడాది నవంబరు, డిసెంబరు నెలల్లో వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ కోసం దరఖాస్తులు చేసుకున్నారు. కానీ వారికి విద్యుత్ కనెక్షన్లు మంజూరు కాలేదు. అదే గ్రామానికి చెందిన మరి కొంత మంది రాజకీయ పలుకుబడి ఉన్నవారు మార్చి నెలలో దరఖాస్తు చేసి ఏప్రిల్ నెలలో మంజూరు చేశారు. అలాగే విద్యుత్ స్తంభాలు, వైర్లు, ట్రాన్స్‌ఫార్మర్లను కూడా మంజూరు చేశారు. కాంట్రాక్టర్‌కు పనులు అప్పగించారు. ఈ నేపథ్యంలో ఒక చోట పనులు చేయడానికి ఎల్‌సీ తీసుకుని మరో చోట పనులు చేయడంతో నిండు ప్రాణం బలి అయ్యింది. ఎల్‌సీ తీసుకుంది విడపనకల్లులోని గడేకల్లు ఫీడర్ కింద అయితే అక్కడ పనులు చేయకుండా, వజ్రకరూరు మండలం చాబాల ఫీడర్ కింద పనులు చేపట్టారు. శనివారం సాయంత్రం వరకూ విద్యుత్ స్తంభాలు పాతిన అధికారులు, కాంట్రాక్టర్లు విద్యుత్ షాక్‌తో కార్మికుడు మృతి చెందగానే పాతిన విద్యుత్ స్తంభాలను తొలగించారు. దీనికి కారణాలు అంతుబట్టడం లేదు. దీంతో ఇక్కడ చేపట్టిన పనులు అధికారికంగా మంజూరు అయిన పనులేనా లేక అనధికారికంగా చేపట్టిన పనులా? అనే అనుమానం కలుగుతోంది. తన కుమారుడు వన్నూరుస్వామి మృతి పట్ల ఉన్నతాధికారులు విచారణకు వచ్చే దొరికి పోతాము అనే ఆలోచనలో అధికారులు ఆదివారం తెల్లవారుజామునే పాతిన విద్యుత్ స్తంభాలను తొలగించారు. వైర్లను నేలపైనే వదిలేశారు. విద్యుత్ స్తంభాలు పాతిన ఆనంతరం గుంతలు నిండగా పొలంలో పక్క రైతు కొంత పరిధి విద్యుత్ స్తంభాలను నేలపైనే వదిలారు. దీంతో ఇక్కడ జరిగిన పనులపై పలు అనుమానాలు కలుగుతున్నాయి. విద్యుత్ అధికారుల అవినీతి, నిర్లక్ష్యంపై ఉన్నతాధికారులు తగిన చర్యలు తీసుకోవాలని మండల రైతులు కోరుతున్నారు.

● ఏఈ సత్యం‌ను వివరణ కోరగా ఎటువంటి విద్యుత్ స్తంభాలు పాత లేదని, పాతిన వాటిని తొలగించలేదని అన్నారు. ఎల్‌సీ తీసుకుంది గడేకల్లు ఫీడర్ కింద, కానీ పనులు చేసింది చాబాల ఫీడర్ కిందని చెప్పారు. ఇది గుర్తించి వన్నూరు స్వామి పనులు చేసేందుకు విద్యుత్ స్తంభం ఎక్కి జంపర్ తీసేందుకు ప్రయత్నించి విద్యుత్ షాక్ గురయ్యాడన్నారు.

● పోల్ టూ పోల్ మ్యాన్ మహబూబ్ బాషాను వివరణ కోరగా తనకు గడేకల్లు ఫీడర్ కింద 9గంటలు ఎల్‌సీ ఇవ్వగ టాకి నుంచి 20కెవి ఎల్‌సీ ఇచ్చా అన్నారు. చాబాల ఫీడర్ కింద ఎల్‌సీ ఇవ్వలేదు. నన్ను అడగలేదు అని తెలిపారు.



విద్యుత్ స్తంభాలను తొలగించడంతో ఏర్పడిన గుంతలు



తొలగించి నేలపై వదిలేసిన విద్యుత్ వైర్లు

ఘనంగా వైజ్ఞానిక ప్రదర్శన

గుంతకల్లుటౌన్,ఆగస్టు 5: పట్టణంలోని శ్రీ శంకరానందగిరి స్వామి డిగ్రీ కళాశాలలో సోమవారం జీవ సాంకేతిక శాస్త్రం బయోటెక్నాలజీ విభాగం ఆధ్వర్యంలో సైన్స్ ఫెయిర్‌ను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమాన్ని ప్రిన్సిపాల్ గోపాల్ ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థులు శాస్త్రవేత్తలుగా ఎదగాలని సూచించారు. అనంతరం విద్యార్థులు తయారు చేసిన ప్రదర్శనలను తిలకించి ప్రతిభ చాటిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. వైస్‌ప్రిన్సిపాల్ సురేష్‌బాబు, పరిపాలన అధికారి చంద్రశేఖర్, అధ్యాపకులు పాల్గొన్నారు.

బీమా పరిహారం అందజేత

గుంతకల్లు, ఆగస్టు 5: ఆకాల మరణం చెందిన రైల్వే ఉద్యోగుల కుటుంబాలకు దక్షిణమధ్య రైల్వే మజ్దూర్ యూనియన్ నాయకులు ఉద్యోగ సహకార పరపతి సంఘం తరఫున బీమా పరిహారాన్ని సోమవారం పంపిణీ చేశారు. రైల్వే కో-ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ సభ్యులుగా ఉన్న గుత్తికి చెందిన ఉద్యోగి కొత్తకోట లోకేష్, గుంతకల్లులో సహాయలోగా పనిచేస్తున్న సుధాకర్ ఆకాల మరణం పొందారు. వీరి ద్వారా రైల్వే సహకార సంఘంలో సభ్యులుగా ఉన్నందున సొసైటీ నుంచి బీమా క్లెయింలను అందజేశారు. పట్టణంలోని మజ్దూర్ యూనియన్ కార్యాలయానికి బాధిత కుటుంబ సభ్యులు పిలిపించి పరిహారాలను చెక్కురూపంలో ఇచ్చారు. లోకేష్ కుటుంబానికి రూ. 5 లక్షలు, సుధాకర్ కుటుంబానికి రూ. 1.62 లక్షలను యూనియన్ డివిజనల్ కార్యదర్శి విజయకుమార్ ఆధ్వర్యంలో అందజేశారు.

రైలు ఢీకొని వ్యక్తి మృతి

గుంతకల్లుటౌన్, ఆగస్టు 5: పట్టణంలోని గుంతకల్లు-గుత్తి రైలుమార్గంలోని సత్యనారాయణ పేట రైల్వే బ్రిడ్జి వద్ద ప్రమాదవశాత్తు రైలు ఢీకొని వంశీకృష్ణ(28)అనే వ్యక్తి మృతి చెందినట్లు జీఆర్పీ పోలీసులు తెలిపారు. సత్యనారాయణపేటకు చెందిన వంశీకృష్ణ బెంగళూరులో ఓ ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. రెండు రోజుల క్రితం బెంగళూరు నుంచి గుంతకల్లు వచ్చాడు. బహిర్భూమికి పట్టాలపైకి వెళ్లాడు. అక్కడ ప్రమాదవశాత్తు రైలు ఢీకొంది. దీంతో అతను తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యులు పరిశీలించి అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు జీఆర్పీ ఎస్ఐ రామదాసు తెలిపారు.

చికిత్స పొందుతూ వృద్ధురాలి మృతి

పుట్లూరు, ఆగస్టు 5: మండలకేంద్రం శివారులోని హెరిటేజ్ వద్ద గత ఆదివారం రాత్రి బైక్ అదుపుతప్పి బోల్తా పడిన ఘటనలో గాయపడ్డ వృద్ధురాలు సుబ్బమ్మ (65) చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు. తాడిపత్రికి చెందిన సుబ్బమ్మ తమకు తెలిసిన రమణతో కలిసి బైక్‌లో పుట్లూరులో ఉన్న బంధువుల ఇంటికి వచ్చి తిరిగి తాడిపత్రికి వెళుతుండగా కాలువ వద్ద ఉన్న స్పీడ్ బ్రేకర్ వద్ద బైక్ అదుపుతప్పి కింద పడ్డారు. దీంతో వెనుకల ఉన్న సుబ్బమ్మ తలకు బలమైన గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందింది. మృతురాలి భర్త గతంలోనే చనిపోగా ముగ్గురు కుమారులు ఉన్నారు. పెద్దకుమారుడు నాగేంద్ర ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ హేమాద్రి తెలిపారు.

వ్యవసాయానికి 9గంటల విద్యుత్ ఇవ్వాలి

యాడికి, ఆగస్టు 5: వ్యవసాయానికి 9గంటల నిరంతర విద్యుత్ ఇచ్చి ఆదుకోవాలని కోరుతూ పలువురు రైతులు సోమవారం ఆయా బ్రాంచ్ ఏఈ రాజారావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ వ్యవసాయానికి 7గంటల విద్యుత్ సరఫరా చేస్తున్నారని, అది కూడా నిరంతరంగా సరఫరా చేయడం లేదని వాపోయారు. ఇలా అయితే పంటలు ఎండిపోతాయని, ఆవేదన వ్యక్తంచేశారు. 9 గంటల విద్యుత్ ఇవ్వాల్సిందేనని డిమాండ్ చేశారు. లేకపోతే సబ్‌స్టేషన్‌ను ముట్టడిస్తామని హెచ్చరించారు. వినతిపత్రం అందజేసిన వారిలో వేణుగోపాల్, రమణారెడ్డి, రవికుమార్, దొరస్వామి, రామేశ్వరరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

చౌడేశ్వరి ఆలయంలో చోరీ

కళ్యాణదుర్గం రూరల్, ఆగస్టు 5: మండలంలోని మల్లిపల్లిలో చౌడేశ్వరి ఆలయంలో ఆదివారం అర్ధరాత్రి చోరీ జరిగింది. సోమవారం ఉదయం ఆలయ పూజారి వెళ్లిన గ్రామస్థులు ఆలయ తలుపులు, సీసీ కెమెరాలు ధ్వంసం అయినట్లు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు డాగ్ స్క్వాడ్‌తో వచ్చి పరిశీలించారు. దుండగులు ఆలయంలోని సీసీ కెమెరా, హుండీలను పగులకొట్టి సమీపంలోని కంపచెట్లలో పడేసి వెళ్లిపోయారు. గ్రామస్థుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.